ప్రజాశక్తి
సోమవారం 26 ఫిబ్రవరి 2024 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

హాజరుకానున్న 59,438 మంది విద్యార్థులు - హాల్ టిక్కెట్ కష్టాలకు చెక్ - కాలేజీలో ఇవ్వకున్నా డౌన్‌లోడ్‌కు అవకాశం

ప్రజాశక్తి-గుంటూరు

వచ్చేనెల 1వ తేదీ నుండి 20వ తేదీ వరకూ నిర్వహించనున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు ఇంటర్ బోర్డు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే ప్రాక్టికల్స్ పరీక్షలు పూర్తయ్యాయి. ఇక థియరీ పరీక్షలకు సర్వం సిద్ధం చేశారు. పరీక్షా కేంద్రాలు, ఇన్విజిలేటర్లు, కేంద్రాల్లో సదుపాయాలు, స్క్వాడ్‌ల నియామకం ఇతర అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 వరకూ పరీక్ష ఉంటుంది. విద్యార్థులను ఉదయం 8.30 గంటలకే కేంద్రాల్లోకి అనుమతిస్తారు. పరీక్షకు ఈ సారి 92 కేంద్రాలను ఎంపిక చేశారు. అయితే వాటిలో 19 పరీక్షా కేంద్రాలు కొత్తగా అనుమతిచ్చారు. అందువల్ల విద్యార్థులు ముందురోజే పరీక్షా కేంద్రాలను సందర్శించాలని అధికారులు తెలిపారు. గతేడాది కంటే ఈ ఏడాది జిల్లాలో దాదాపు నాలుగువేల అడ్మిషన్లు పెరిగాయి. పెరిగిన విద్యార్థులకు అనుగుణంగా కొత్త కేంద్రాలకు అనుమతిచ్చారు. అన్నిచోట్లా బెంచీలు, ఫ్యాన్లు, లైట్లు ఇతర సదుపాయలు ఉన్నట్లు అధికారులు చెప్పారు.

ఇంటర్ మొదటి సంవత్సరం జనరల్ విద్యార్థులు 30,820 మంది, ఒకేషనల్ విద్యార్థులు 1010 మంది, ద్వితీయ సంవత్సరం జనరల్ విద్యార్థులు 26,573 మంది, ఒకేషనల్ విద్యార్థులు 1032 మంది మొత్తం 59,438 మంది హాజరుకానున్నారు. హాల్ టిక్కెట్లు తీసుకునే విషయంలో కొందరు విద్యార్థులకు ఎదరయ్యే సమస్యలకు ఈ ఏడాది బోర్డు పరిష్కారం చూపింది. గతంలో కొన్ని యాజమాన్యాలు ఫీజులు కట్టలేదని, వివిధ కారణాలతో హాల్‌టిక్కెట్లు నిలుపుదల చేసేవారు. అటువంటి ఇబ్బందుల్ని దృష్టి ఉంచుకొని యాజమాన్యాలు హాల్‌టిక్కెట్లు ఇవ్వకపోయినా, వెబ్‌సైట్ నుండి డౌన్‌లో చేసుకొని, దానిపై ప్రిన్సిపాల్ సంతకం లేకుండానే పరీక్షకు అనుమతిస్తారు. కాగా గత సంవత్సరం వరకూ ప్రిన్సిపాల్ సంతకం తప్పనిసరి. పరీక్ష కేంద్రంలో చీఫ్ సూపరింటెండెంట్ వద్ద తప్ప ఇతరులకు సెల్‌ఫోన్లు అనుమతించరు. సిఎస్ వద్ద కూడా బోర్డు ఇచ్చిన సిమ్‌తోకూడిన ఫోన్ మాత్రమే ఉంటుంది. విద్యార్థులకు ఏదైనా సమస్య వచ్చే ఫిర్యాదు చేయటానికి ఆర్‌ఒఐ కార్యాలయంలో హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు చేశారు. 7815968897, 0863-2228528 నంబర్లకు ఫోన్ చేసి సహాయం పొందవచ్చు.

కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశాం

మెటీరియల్ మొత్తం వచ్చింది. జిల్లాలో గుర్తించిన 16 స్టోరేజి పాయింట్లకు మెటీరియల్‌ను చేర్చి, కట్టుదిట్టమైన భద్రత మధ్య ఉంచుతాం. నాలుగు ఫ్లైయింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు చేశాం. చీఫ్ సూపరింటెండెంట్లు, ఇతర సిబ్బందికి శిక్షణిచ్చాం. అన్ని పరీక్షా కేంద్రాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేసి, ఇంటర్ బోర్డుకు, ఆర్ఐఒ కార్యాలయానికి వాటిని అనుసంధానం చేసి, నిరంతరం పర్యవేక్షిస్తాం. విద్యార్థులు ఎలాంటి ఆందోళనకూ గురికాకుండా సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకొని పరీక్షలు రాయాలి.

ఆర్ఐఒ జి.కె.జుబేర్

40 ఏళ్లుగా ఎదురుచూపులే మిగిల్చారు..

4లో

- ఇప్పటికైనా పనులు ప్రారంభిస్తేనే ప్రజలకు నమ్మకం
- వరికపూడిశెల ప్రాజెక్టుపై కౌలురైతు సంఘం, సిఐటియు
- తొలివిడతగా రూ.1600 కోట్లు సత్వరమే కేటాయించాలని డిమాండ్

తెనాలి సీటుపై ఆలపాటి కినుక

- టిడిపి అధినేత చంద్రబాబు పిలుపు
- భవిష్యత్‌కు హామీ

5లో

అటవీ సంపద, వన్య ప్రాణుల సంరక్షణ ప్రథమ కర్తవ్యం

ప్రజాశక్తితో పల్నాడు జిల్లా అటవీశాఖ అధికారి ఎస్.రామచంద్రయ్య

8లో

మంగళగిరిలో ఎయిమ్స్ నమూనాలను పరిశీలిస్తున్న గవర్నర్, కేంద్ర మంత్రి తదితరులు

మంగళగిరిలో 183.11 ఎకరాల్లో 960 పడకలు, ఆసుపత్రి, 125 సీట్ల వైద్య కళాశాలతో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)ను ఆదివారం సాయంత్రం భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ జాతికి రాజ్‌కోట్ నుండి వర్చువల్‌గా అంకితం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, కేంద్ర బొగ్గు, గనులు మరియు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి, కేంద్ర ఆరో గ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ భారతి ప్రవీణ్ పవర్, రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్యవిద్యా శాఖ మంత్రి విడదల రజిని, వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ స్పెషల్ సియస్ ఎం.టి.కృష్ణబాబు, జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. దీంతోపాటు తెనాలిలోని ప్రభుత్వ ఆస్పత్రిలో రూ.5 కోట్లతో నిర్మించే 100 పడకలతో క్రిటికల్ కేర్ యూనిట్‌కు ప్రధాని వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు.

గ్రూప్-2 పరీక్ష ప్రశాంతం

ప్రజాశక్తి - గుంటూరు, పల్నాడు జిల్లా

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఆదివారం నిర్వహించిన గ్రూప్-2 స్క్రీనింగ్ పరీక్ష ప్రశాంతంగా జరిగాయి. గుంటూరు జిల్లా వ్యాప్తంగా 56 పరీక్షా కేంద్రాలలో 28,209 మంది అభ్యర్థులకుగాను 23,334 మంది (82.7 శాతం) హాజరయ్యారు. 4875 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. గుంటూరులో పట్టాభిపురంలోని టిజెపిఎస్ కాలేజి పరీక్షా కేంద్రాన్ని గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి పరిశీలించారు. వట్టిచెరుకూరు మండలంలోని మలినేని లక్ష్మయ్య ఇంజినీరింగ్ కాలేజిని, చౌడవరంలోని ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజిని, గుంటూరులోని ఆంధ్రా ముస్లిం కాలేజి పరీక్షా కేంద్రాన్ని సందర్శించి జిల్లా సంయుక్త కలెక్టర్, పరీక్ష కో-ఆర్డినేటింగ్ ఆఫీసర్ అయిన జి.రాజకుమారి పరిశీలించారు. పరీక్ష ముగిసిన తర్వాత మొత్తం సామగ్రిని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచే వరకూ జేసీ పర్యవేక్షించారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అభ్యర్థులు వారి సెల్‌ఫోన్లను కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో అప్పజెప్పారు.

పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలోని పలు పరీక్ష కేంద్రాలను పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ పరిశీలించారు. రామిరెడ్డిపేటలోని శ్రీ చైతన్య జూనియర్ కాలేజి, కృష్ణవేణి డిగ్రీ కాలేజి, పల్నాడు బస్టాండ్‌లోని ఎస్ఎస్ఎన్ కాలేజీల్లో కేంద్రాలను సందర్శించారు. పరీక్ష కేంద్రాల్లోని పలు రూములను ఇన్‌ఛార్జి జిల్లా రెవెన్యూ అధికారి అజయ్‌కుమార్‌తో కలిసి తనిఖీ చేశారు.

గుంటూరులో టిజెపిఎస్ కాలేజీలో పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన గుంటూరు కలెక్టర్, కేంద్రం వద్ద నిరీక్షిస్తున్న అభ్యర్థులు

పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్

నాదెండ్ల మనోహర్‌కు హర్షంతో స్వాగతం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

జనసేన, టిడిపి ఉమ్మడి పార్టీ అభ్యర్థిగా తెనాలి అసెంబ్లీ నియోజకవర్గం నుండి పోటీకి ఖరారైన జనసేన పిఎసి చైర్మన్ నాదెండ్ల మనోహర్‌కుకు టిడిపి, జనసేన శ్రేణులు ఆదివారం ఘన స్వాగతం పలికాయి. అసెంబ్లీ సీటు దక్కించుకుని తొలిసారి తెనాలి అడుగుపెట్టిన మనోహర్‌ను కలిసేందుకు అభిమానులు బారులుతీరారు. కొన్నిచోట్ల ఇరుపార్టీల నాయకులు ర్యాలీ నిర్వహించారు. మహిళ కార్యకర్తలు హారతి పట్టారు. జనసేన, టిడిపి సమన్వయంతో పని చేసి విజయం సాధిస్తామని ఈ సందర్భంగా మనోహర్ ధీమా వ్యక్తం చేశారు.

శామ్‌సంగ్ గెలాక్సీ ఫిట్3 ఆవిష్కరణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

అతిపెద్ద ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ శాంసంగ్ గెలాక్సీ ఫిట్ 3ని విడుదల చేసినట్లు శాంసంగ్ షోరూమ్ మేనేజర్ కె.ఈశ్వర్ కుమార్ తెలిపారు. ఎం.జి.రోడ్డులోని షోరూమ్ నందు నూతన ఉత్పత్తుల పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఫిట్‌నెస్‌కు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇస్తున్నారని ఇందులో భాగంగానే శాంసంగ్ కంపెనీ మొదటిసారిగా సరికొత్త ఫిట్‌నెస్ ట్రాకర్‌ను రూపొందించినట్లు తెలిపాడు. ప్రతి ఒక్కరూ తమ ఉత్తమ అనుభూతిని పొందేవిధంగా ఆరోగ్యకరమైన జీవనశైలిని అవలంభించేలా చేస్తుందన్నారు. గెలాక్సీ ఫిట్3 అనేది శాంసంగ్ యొక్క తాజా వెరబుల్ డివైజ్ అన్నారు. ఇది విస్తృత స్థాయి డిస్‌ప్లేతనో అల్యూమినియం బాడీని కలిగిఉందన్నారు.వినియోగదారులు తమ ఆరోగ్యం, సంరక్షణ డేటాను, రోజువారీ వ్యాయామాల నుండి ప్రశాంతమైన నిద్ర వరకు ప్రశాంతంగాఉండేందుకు ఉపయోగపడుతుందన్నారు.

100 పడకలతో క్రిటికల్ కేర్ యూనిట్

- తెనాలి ప్రభుత్వాస్పత్రిలో రూ.5 కోట్లతో నిర్మాణం
- వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన ప్రధాని మోడీ

ప్రజాశక్తి-తెనాలి

స్థానిక జిల్లా వైద్యశాలలో క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణానికి ఆదివారం ప్రధానమంత్రి నరేంద్ర మోది వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని వీక్షించేందుకు ఆసుపత్రిలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న డిసిహెచ్ఎస్ డాక్టర్ సుబ్రహ్మణ్యరాజు మాట్లాడుతూ 100 పడకలతో రూపుదిద్దుకోనున్న క్రిటికల్ కేర్ యూనిట్‌తో ఎంతో ప్రయోజనం ఉంటుందని, ముఖ్యంగా యాక్సిడెంట్ కేసులకు మంచి వైద్యం అందుతుందని అన్నారు. రూ.5 కోట్ల అంచనాతో యూనిట్ నిర్మాణం జరుగనుందని, దానిలో రూ.14 కోట్లతో ఆధునిక వైద్య పరికరాలు అందుబాటులోకి వస్తాయని, దాదాపు 15 నెలల్లో నిర్మాణం కూడా పూర్తి కావొచ్చని వివరించారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్ఎం టీమ్ డాక్టర్ మన్మోహన్, డాక్టర్ శ్రావణ్‌బాబు, ఏపిఎంఎస్ఐడిసి డీఈఈ కె.వెంకటరత్తయ్య, జిల్లా ఉపవైద్యాధికారి డాక్టర్ ఇ.అన్నపూర్ణ, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్‌సాభాగ్యవాణి, ఏవో ఎం.మజిదాబి, డాక్టర్స్ శ్రీకాంత్, వినీల్, మంజూష, మానస, సీనియర్ సహాయకులు వై.కవిత పాల్గొన్నారు.

సుదీర్ఘ పోరాటంతో విజయం

ప్రజాశక్తి ఉయ్యూరు : 42 రోజుల సుదీర్ఘమైన ఉధత పోరాటంతో ప్రభుత్వం మెడలు వంచి హక్కుల సాధనలో ఫలితాలు సాధించామని అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు బేబీ రాణి అన్నారు. ఆదివారం ఉయ్యూరు లోని నాగాళ్ల రాజేశ్వరమ్మ జానకి రామయ్య విజ్ఞాన కేంద్రంలో కష్ణాజిల్లా అంగన్వాడి వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అభినందన సభ జరిగింది. ఈ సభలో బేబీ రాణి మాట్లాడుతూ అంగ న్వాడి వర్కర్స్ హెల్పర్స్ నిరంతర పోరాటాల వల్లే ఈ విజయం సాధ్యమైందని ఆమె అన్నారు. హక్కుల సాధనకై నిరంతరం పోరాటాలతోనే సాధ్యమవుతుందని అంగన్వాడి పోరాటం ఒక నిదర్శనం అని, సమ్మె నిరసన కార్యక్రమాల్లో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్న నాయకురాలు అందరికీ అభినందనలు తెలుపుతున్నానని ఆమె అన్నారు. సిఐటియు మరియు ఇతర ప్రజా సంఘాల మద్దతు సంఘీభావాలతో సఫలీకతులమ య్యామని జిల్లా ప్రధాన కార్యదర్శి రమాదేవి అన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు చౌటపల్లి రవి సహకారంతోపాటు అన్ని ప్రాజెక్టులలోనే సీఐటీయూ కార్యదర్శులు మా ఉద్యమానికి తమ వంతు కషి సహకారం అందించారని వారికి రమాదేవి అభినందనలు తెలిపారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ తో పాటు అనేక అంశాలలో ప్రభుత్వం సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలి

ప్రజాశక్తి - తాడికొండ

అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాల్సిన ఆవశ్యకత మనందరిపైనా ఉందని ప్రతిపాడు ఎమ్మెల్యే, వైసిపి తాడికొండ నియోజకవర్గ ఇన్చార్జి మేకతోటి సుచరిత అన్నారు. తాడికొండ మండలం నిడుముక్కలలో అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని ఆదివారం ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని అంబేద్కర్ గొప్ప రాజ్యాంగాన్ని రచించారని కొనియాడారు. ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక నియోజకవర్గాలు, మహిళలకు రిజర్వేషన్లు అంబేద్కర్ పుణ్యమన్నారు అంబేద్కర్ స్ఫూర్తితో రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి పాలనను కొనసాగిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో మేకతోటి దయసాగర్, జెడ్‌పిటిసీ గుడిమెట్ల జ్యోతి, మాజీ ఎంపీపీ బండ్ల పున్నారావు, వైసిపి మండల అధ్యక్షులు బి.వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ మాదాసు రత్నకుమారి ఏసురత్నం, ఎంపీటీసీ బోడపాటి సుశీల, బెజ్జం సాయి ప్రసాద్, వెంకటస్వామి పాల్గొన్నారు.

మంచినీటి చెరువుకు మురుగునీరు

పైలెట్ స్కీముకి కొట్టిన గండి

ప్రజాశక్తి-గన్నవరం : అధికారులు నిర్లక్ష్యంగా చేసిన పని ప్రజల ఆరోగ్యానికి శాపంగా మారనుంది. మంచినీటి చెరువులోకి మురుగు నీటిని తరలిస్తున్నారు. అందుకు పైలెట్ స్కీం చెరువుకు, తొండం గట్టు మురుగునీటి వాగుకు గండి కొట్టారు. ఈ నీటిని ప్రజలకు సరఫరా చేస్తే అనేక రోగాలు వస్తాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

వివరాల్లోకి వెళితే.. గన్నవరం పట్టణ ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు నిర్మించిన కోనాయి చెరువు పైలట్ ప్రాజెక్టు స్టోరేజ్ ట్యాంకుకు అధికారులే గండి కొట్టారు. రూ.కోట్లు ఖర్చు పెట్టిన మంచినీటి నిల్వ ప్రాజెక్టుకు గండి కొట్టడమే కాక పట్టణ పరిసరాల్లో మురుగు చేరడంతో పాటు చేపల పెంపకం చేపట్టే తొండం గట్టు నీటిని వదలడం ఏమిటని ప్రజలు నిల దీస్తున్నారు. తెంపల్లి, చెంచుల కాలనీ ఇతర ప్రాంతాల్లో అతిసారం కేసులు వెలుగు చూస్తున్నా జాగ్రత్తలు చేపట్టాల్సిన పంచాయతీరాజ్ అధికారులే.. గండి కొట్టి మురుగు నీటిని ప్రజలకు సరఫరా చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రూ.4.5 కోట్ల ఆదాయం వచ్చే పంచాయతీలో కనీసం తాగునీరు అందించరనే విమర్శ ఉంది. నిధులన్నీ ఏమవుతున్నాయో తెలియడం లేదంటున్నారు. తొండం గట్టులో చేపలు పెంపకానికి పంచాయతీ అధికారులు అనుమతి ఇచ్చారు. దీంతో చేపలపాట గారు ఆ చెరువులో అనేక వ్యర్థాలు చేపలకు వేస్తున్నాడు. దీనికి తోడు ఎస్టీ కాలనీలోని మురుగు అందులో కలుస్తుంది. మర్లపాలెం ఏరియాలోని, గన్నవరం ఏరియాలోని పొలాల్లో మురుగు కూడా అందులోనే చేరుతుంది. గేదలు కూడా దిగుతున్నాయి.దీంతో నీరు అంతా కలుషితంగా మారింది. ఆ నీటిని ప్రజలు తాగితే రోగాలు రావడం ఖాయమని చెబుతున్నారు. విచిత్రం ఏమంటే పంచాయతీ పాలకవర్గానికి తెలియకుండా అధికారులు ఈ చర్యలు చేపట్టారని అంటున్నారు. దీనిపై పంచాయతీ అధికారులను వివరణ కోరగా తొండం గట్టులోని నీరు శుభ్రంగా ఉందని ప్రాజెక్టులోకి వదలినట్లు చెప్పడం గమనార్హం. సత్వరమే గండిని పూడ్చి ప్రాజెక్టులోని నీటిని శుభ్రపరి చిన తర్వాతనే ప్రజలకు సరఫరా చేయాలని కోరుతున్నారు.

మురుగునీటిని తక్షణమే నిలుపుదల చేయాలి : సిపిఎం

పైలెట్ స్కీమ్ తెలుగులో మురుగు నీటిని కలపడాన్ని అధికారులు తక్షణమే నిలుపుదల చేయాలని సిపిఎం నాయకులు మిరప నాగేశ్వరరావు, గుండె మెడ ఉదయ్ భాస్కరరావు డిమాండ్ చేశారు. చెరువులో కలుషిత నీటిని కలపడం వలన ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుందని చెప్పారు. ఇప్పటికే ప్రజలు అనేక సమస్యలతో బాధపడుతున్నారని గుర్తు చేశారు. పరుగు నీటితో కలుషితమైన తొండంగట్టు చెరువులోని నీటిని మంచినీటి చెరువులో కలపడం సరికాదన్నారు. అధికారులు తక్షణమే నియంత్రణ చర్యలు చేపట్టకపోతే ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

పెన్షన్ నవీకరణకు ప్రభుత్వం సహకరించాలి

ఎఐబిఆర్‌ఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎస్‌సి జైన్

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ

విశ్రాంత బ్యాంక్ ఉద్యోగులు చాలీచాలని పెన్షన్‌తో, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పెన్షన్ నవీకరణకు అనేక దశాబ్దాలుగా ప్రభుత్వంతో పోరాడుతూనే ఉన్నా విజయం సాధించలేకపోయాం అని ఆల్ ఇండియా బ్యాంక్ రిటైరీస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్‌సి జైన్ అన్నారు. ఆదివారం ఉదయం గవర్నర్‌పేటలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ బ్యాంకు రిటైరీస్ ఫెడరేషన్ వారి 3వ త్రైవార్షిక సమావేశానికి సభాప్రారంభకులుగా విచ్చేసిన జైన్ ప్రసంగిస్తూ విశ్రాంత బ్యాంకు ఉద్యోగుల పెన్షన్ దశాబ్దాలు గడిచినా పెరుగుదల లేదని, కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రపతులకు, పార్లమెంటు సభ్యులకు వినతి పత్రాలు సమర్పించినా ఫలితంలేదు అన్నారు. కుటుంబ పెన్షన్, వైద్యఖర్చులు తదితర విషయాలలో మెరుగుదల ఆశిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యఅతిథిగా ఆల్ ఇండియా బ్యాంక్ రిటైరీస్ ఫెడరేషన్ అధ్యక్షులు ఎస్ ఎం దేశ్ పాండే ప్రసంగిస్తూ 2002 ముందు పదవీ విరమణ చేసిన వారికి కరువుభత్యం పెంపుదల అభినందనీయం అన్నారు. సంయుక్త ప్రధాన కార్యదర్శి కె విశ్వనాథ్ నాయక్, ఫెడరేషన్ అధ్యక్షులు బివివి.కొండలరావు సభాధ్యక్షులుగా ప్రసంగిస్తూ ఐకమత్యంగా ముందడుగు వేస్తే విజయం మనదే అన్నారు. ప్రధాన కార్యదర్శి ఎ.ఎల్లారావు అతిథులను ఆహ్వానించి సమావేశ ప్రాధాన్యత వివరించారు. చైర్మన్ ఎం.బి.శంకరరావు, ఉపాధ్యక్షులు ఎం.ఎన్.రావు, వి.జగన్ మోహనరావు, ఎన్.కృష్ణమోహన్ ప్రసంగించారు. చివరగా సంయుక్త ప్రధాన కార్యదర్శి పి.వీరారెడ్డి వందన సమర్పణ చేశారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా వివిద బ్యాంకులకు చెందిన 300 పైగా ప్రతినిధులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

చైర్మన్: ఎం బి శంకరరావు, అధ్యక్షులు: బి వి వి కొండలరావు, ప్రధాన కార్యదర్శి: ఎ ఎల్లారావు, కోశాధికారి: నరేంద్రదేవ్, సహ కోశాధికారి: ఎన్ కష్ణమోహన్, సంయుక్త ప్రధాన కార్యదర్శి: వి జగన్ మోహనరావు, కార్యనిర్వాహక కార్యదర్శులు: యం వి ఎస్ శర్మ, పి నారాయణ రావు, జి.కృష్ణవేణి తదితర 33 మందితో కార్యవర్గం ఏర్పడింది.

డ్రాగన్ సాగుతో లాభాల బాట

- మొగ్గు చూపుతున్న రైతులు
- పల్నాడులో విస్తరిస్తున్న 'డ్రాగన్' సాగు
- ఒక్కసారి పెట్టుబడితో కొన్నేళ్లపాటు దీర్ఘకాలిక దిగుబడి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కొన్నేళ్లుగా సంప్రదాయ పంటలైన ఆహార, వాణిజ్య పంటల సాగులో అధిక పెట్టుబడులు పెట్టి నష్టపోయిన రైతులు వ్యవసాయ అనుబంధ రంగాల్లోనే అన్వేషణ కొనసాగిస్తున్న క్రమంలో మలేషియా థాయిలాండ్ వియత్నం వంటి దేశాలలో సాగు చేసే డ్రాగన్ పండ్ల సాగు చేపట్టి లాభాలు అర్ధిస్తున్నారు. ఎలాంటి చీడపీడలు ఆశించని ఒక్కసారి పెట్టుబడి పెడితే కొన్నేళ్లపాటు దీర్ఘకాలిక దిగుబడినిచ్చే డ్రాగన్ సాగు వైపు రైతులు మొగ్గు చూపు తున్నారు. పల్నాడు జిల్లాలో నరసరావుపేట నకరికల్లు వినుకొండ వంటి ప్రాంతాలతో పాటు తక్కువ నీటి వనరులు కలిగిన అనుకూలంగా లేని నేలల్లో సైతం డ్రాగన్ పండ్ల సాగు చేపట్టి తోటి రైతులకు ఆద ర్శంగా నిలుస్తున్నారు.

ఒక ఎకరా పొలంలో డ్రాగన్ సాగు చేయాలంటే రూ 4 లక్షల నుండి రూ 5 లక్షల వరకు ఖర్చు అవుతుందని ఎకరాకు 500 వరకు సిమెంటు లేదా రాతి స్తంభాలు ఏర్పాటు చేసుకొని ఒక్కో స్తంభానికి 4 మొక్కల చొప్పున 2000 మొక్కలు నాటుకోవాల్సి ఉంటుందని మొక్కలను 10ఐ7 అడుగుల నిష్పత్తిలో రాళ్ళను పాతిన తర్వాత పైన టైర్లు లేదా సిమెంట్ చక్రాలు ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుందని ఇప్పటికే సాగు చేపట్టిన రైతులు చెబుతున్నారు. డ్రిప్ పద్ధతి ద్వారా నిరందించాల్సి వస్తే 10 రోజులలో కనీసం 2 తడులు నీటిపారుదల ద్వారా అయితే 15 నుండి 20 రోజులకో సారి ఒక తడి ఇవ్వాల్సి ఉంటుందని చెబుతున్నారు. డ్రాగన్ పండ్ల తోటలో అంతర పంటలు సాగు చేయడం ద్వారా చీడ పీడల బెడద ఉండదని పశువుల ఎరువు వేపపిండితో పాటు ఇతర సేంద్రియ ఎరువులు వినియోగించడం ద్వారా నాణ్యమైన ఆరోగ్య కరమైన ఉత్పత్తులు దిగుమతి అవుతాయని తద్వారా అధిక లాభాలు వస్తాయని చెబుతున్నారు. మొక్కలు నాటిన 16 నుండి 18 నెలలకు మొదటి కాపు వస్తుందని నేల స్వభావాన్ని బట్టి 20 నుండి 30 ఏళ్ల వరకు దిగుబడి వస్తూనే ఉంటుందని రైతులు చెబు తున్నారు. ఎకరానికి మొదటిసారి 4 నుండి 5 టన్నులు 2 ఏడాది నుండి 6 నుండి 10 టన్నుల వరకు దిగుబడి సాధించేందుకు అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

నకరికల్లులో ..

తోటను పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, ఉద్యాన శాఖాధికారులు

.ట్రైనీ కలెక్టర్ కు డ్రాగన్ పండ్లను అందజేస్తున్న మహిళా రైతు

రోడ్డు పక్కనే డ్రాగన్ పండ్లు అమ్ముతున్న యువకుడు

నరసరావుపేట మండలం అర్వపల్లిలో సాగవుతున్న డ్రాగన్ పండ్ల తోట

మార్కెట్లో మంచి డిమాండ్

ప్రజల ఆరోగ్యానికి మేలు చేసే డ్రాగన్ పండ్లను ప్రతి ఒక్కరూ తినాలని డ్రాగన్ పండ్లు తినడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని పోషక విలువలు ఔషధ గుణాలు మెండుగా ఉంటాయని వైద్యులు సూచిస్తున్నారు. దీంతో మార్కెట్లో వినియోగం పెరిగింది. ఒక ఏడాది డ్రాగన్ పంట కాలంలో ఒక్కొక్క చెట్టు నుండి 50 వరకు కాయలు వస్తాయని పండు బరువు 400 గ్రాముల నుండి 600 గ్రాముల వరకు ఉంటుందని మార్కెట్లో కేజీ ధర 180 నుండి 220 వరకు పలుకుతుందని రెండేళ్లలో పెట్టుబడి తిరిగి పొందవచ్చునని రైతులు అంటున్నారు.

వాణిజ్య పంటల కన్నా పండ్ల తోటలే మేలు

నరసరావుపేట మండలం అరవపల్లి రైతు షేక్ సాంబశివరావు

కొన్నేళ్లుగా కర్ణాటక రాష్ట్రంలో మిర్చి సాగు చేపట్టి ఆశించిన మేర పంటలలో లాభాలను ఆర్జించలేకపోయాను. ఈ నేపథ్యంలోనే కర్ణాటక నుండి వచ్చి గత నాలుగేళ్ల క్రితం సొంత వ్యవసాయ భూమిలో బావి తవ్వించి రెండు ఎకరాలలో డ్రాగన్ సాగు చేపట్టాను. ప్రస్తుతం సాగు విస్తీర్ణం 5 ఎకరాల వరకు సాగు చేస్తున్నాను. వ్యాపా రులే తోట దగ్గరకు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం రాయితీలు అందించి దిగు బడిని దళారీ వ్యవస్థ లేకుండా ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తే రైతులు లాభాలు పొందుతారు.

పండ్లతోట సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం అందించాలి

రొంపిచర్ల మండలం,సంతగుడిపాడు రైతు ఆకుల అప్పారావు

రైతులకు లాభాలను చేకూర్చే డ్రాగన్ పండ్ల సాగుకు ప్రభుత్వం రైతులు కల్పించాలి. ఉద్యాన శాఖ ద్వారా రాయితీ రుణాలు మంజూరు చేయించాలి. మార్కెటింగ్ సౌకర్యం లేక సాగు చేపట్టిన రైతులు కొన్ని ప్రాంతాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్ల వెంట కూర్చుని అమ్ముకుంటున్నారు. అధిక మొత్తంలో సాగు చేసే అమ్ముకువడం సాధ్యం కాదు. యాజమాన్య పద్ధతులపై అధికారులు సూచనలు సలహాలు ఇవ్వాల్సిన అవసరం కూడా ఉంది.

ఎకరాకు రాయితి రూ.30 వేలు

పల్నాడు జిల్లా ఉద్యాన వనశాఖా ధికారి బిజె బెన్ని

పల్నాడు జిల్లాలో 110 హెక్టర్లలో డ్రాగన్ పండ్ల సాగు చేసుకునే రైతులకు ప్రభుత్వం రాయితీ మంజూరు చేసింది. ఒక హెక్టార్ కు మొదటి ఏడాది 3 ఏళ్ల పాటు రూ 10 వేలు చొప్పున మొత్తం రూ 30 వేలు అందజేస్తుంది. ఉపాధి హామీ పథకం కింద 50 సెంట్ల విస్తీర్ణానికి రూ 1.50 లక్షలు ప్రభుత్వం అందజేస్తుంది. అయితే ఈ ప్రక్రియ ఇంకా ప్రారంభం కాలేదు. డ్రాగన్ పండ్ల తోటల సాగు పట్ల ఆశక్తి ఉన్న రైతులు ఉద్యాన శాఖ అధికారుల సలహాలు సూచనలు తీసుకొని సాగుకు ఉపక్రమించాలి. రాయితీలు కింద డ్రాగన్ పం డ్లతో ఇతర ఉద్యాన పంటలు ప్రారంభం కాలేదు. ప్రారంభమైతే రైతులకు తెలియజేస్తాం.

గుర్తుతెలియని మృతదేహం

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

పొన్నూరు మండలం వెల్లలూరు మురికి కాలువలో గుర్తుతెలియని మృతదేహాన్ని గుర్తించినట్లు రూరల్ ఎస్సై బండ్ల భార్గవ్ తెలిపారు. అతని వయసు సుమారు ముప్పై నుంచి ముప్పై ఐదేళ్లు ఉంటాయని, పొడుగు చేతుల చొక్కా,నిక్కరు ధరించి ఉన్నట్లు చెప్పారు. ఆచూకీ తెలిసిన వారు పొన్నూరు రూరల్ పోలీస్ వారిని సంప్ర దించాల్సిందిగా కోరారు.

నిరసన వ్యక్తం చేస్తున్న బిజెపి నాయకులు

బిజెపి 'ప్రజాపోరుయాత్ర'లో వివాదం

- వైసిపి నేత దుకాణం ముందు ప్రచారయాత్ర
- అడ్డు చెప్పిన వైసిపి నేత
- దుర్భాషలాడిన బిజెపి నేతలు
- వైసిపి వర్గీయుల దాడి
- బిజెపి నరసరావుపేట ఇంచార్జ్‌కి స్వల్ప గాయాలు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

బిజెపి రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ప్రజా పోరు యాత్ర ప్రచార కార్యక్రమంలో భాగంగా నరసరావుపేట నియోజక వర్గ ఇన్చార్జి రంగిశెట్టి రామకృష్ణ ఆధ్వర్యంలో బిజెపి నాయకులు నరసరావుపేట మండలంలోని అల్లూరువారి పాలెంలో ఆదివారం ప్రచార కార్యక్రమం నిర్వహిం చేందుకు ప్రచార వాహనంతో వెళ్లారు. గ్రామంలోని ప్రధాన కూడలిలో గల వైసిపి నేత ఎంపిటిసి సభ్యులు యాంపాటి వెంకటప్పా రెడ్డి దుకాణం ముందు బిజెపి ప్రచార వాహనం నిలుపు తుండగా ఆయన అడ్డుచెప్పారు. తన దుకాణం ఎదుట కాకుండా మరో ప్రాంతంలో ప్రచార కార్యక్రమం నిర్వ హించుకోవాలని చెప్పడంతో వెంకటప్పారెడ్డిని బిజెపి వర్గీయులు దుర్భాష లాడారు. సహించలేని వెంకటప్పా రెడ్డి తన అనుచరులను ఏకం చేసి బిజెపి వర్గీయులపై దాడికి పాల్పడ్డారు. దాడిలో ప్రచార వాహనం ఫ్లెక్సీలు చినిగిపోగా రంగిశెట్టి రామకృష్ణకు స్వల్ప గాయాలయ్యాయి.

వైసిపి వర్గీయులు చింపివేసిన ఫ్లెక్సీ

ఈ సందర్భంగా రంగిశెట్టి రామకృష్ణ మాట్లాడుతూ బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి ఆదేశాల ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాపోరు బాట నిర్వహిసు _న్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా నరస రావు పేట నియోజకవర్గంలో ప్రజా పోరు యాత్రలో వైసిపి ప్రభుత్వ వైఫ ల్యాలను, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివ రించడానికి వచ్చిన తమను చూసి ఓర్చుకోలేకనే వైసిపి వర్గీ యులు దాడి చేశారని మండిపడ్డారు.

రంగిశెట్టి రామకృష్ణ

40 ఏళ్లుగా ఎదురుచూపులే మిగిల్చారు..

- ఇప్పటికైనా పనులు ప్రారంభిస్తేనే ప్రజలకు నమ్మకం
- వరికపూడిశెల ప్రాజెక్టుపై కౌలురైతు సంఘం, సిఐటియు
- తొలివిడతగా రూ.1600 కోట్లు సత్వరమే కేటాయించాలని డిమాండ్

విలేకర్లతో మాట్లాడుతున్న రాధాకృష్ణ, తదితరులు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

వరికపూడిశెల ప్రాజెక్టు కోసం వెల్దుర్తి, దుర్గి, మాచర్ల, వినుకొండ, బొల్లాపల్లి, కారంపూడి, గురజాల, యర్రగొండపాలెం, పుల్లలచెరువు తదితర మండలాల ప్రజలు 40 ఏళ్లుగా ఎదురు చూస్తున్నారని, పాలకులు మాత్రం శంకుస్థాపనలతోనే సరిపెడుతున్నారని కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ, సిఐటియు పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.హనుమంతరెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సత్వరమే నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని కోరారు. ఈ మేరకు స్థానిక పండరిపురంలోని సిఐటియు కార్యాలయంలో ఆదివారం వారు విలేకర్లతో మాట్లాడారు. అభివృద్ధి గురించి పాలకులు పదేపదే చెబుతున్నారని, అందుకు కీలకం నీటి వనరులు అనే విషయం వారికి తెలియదా? అని ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే లక్షా 20 వేల ఎకరాలకు సాగునీటితోపాటు తాగునీటి అవసరాలూ తీరతాయని చెప్పారు. భూగర్భ జలాల మట్టం పెరుగుతుందన్నారు. ఇంతటి ప్రాధాన్యమున్న ప్రాజెక్టుకు 1996 మార్చి 5న అప్పటి సిఎం నారా చంద్రబాబు నాయుడు వెల్దుర్తి మండలం శిరిగిరిపాడులోని వీరస్వామి గుడివద్ద, 2008 జూన్ 6వ తేదీన అప్పటి సిఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వెల్దుర్తి మండలం గంగలకుంట వద్ద శంకుస్థాపన చేశారని, అయితే శిలాఫలకాలు దాటి పనులు కదల్లేదని అన్నారు. తాజాగా సిఎం జగన్‌మోహన్‌రెడ్డి గతేడాది నవంబర్ 15న మాచర్లలో వర్చువల్‌గా శంకుస్థాపన చేశారని, ఇప్పటికీ పనులు ఒక్క అడుగు కూడా ముందుకు పోలేదని విమర్శించారు. పైన పేర్కొన్న మండలాల్లో 30 ఏళ్ల క్రితం బోరు వేస్తే 30 అడుగల్లోనే నీరు వచ్చేదని, ఇప్పుడు 1300 అడుగులు వేసినా ఫలితం ఉండడం లేదని తెలిపారు. వేసవిలో తాగునీటికి జనం అల్లాడుతున్నారన్నారు. ప్రతి కుటుంబం నెలకు రూ.వెయ్యి పెట్టి తాగునీరు కొనుక్కోవాల్సి వస్తోందన్నారు. ఈ ప్రాంత యువతకు ఇక్కడ ఉపాధి కరువై హైదరాబాద్, తిరుపతి, ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని చెప్పారు. నాగార్జున సాగర్ రిజర్వాయర్లో కొండల మధ్య సహజ సిద్ధంగా ఏర్పడిన సాగర్ చీలికలో నిలిచి ఉండే నికర జలాలు, మిగులు జలాలను వజ్రాలపాడు తండా వరకు నీరు వచ్చే విధంగా పథకాన్ని రూపొందించారన్నారు. దాంతో 50 వేల ఎకరాలకు నేరుగా సాగునీరు అందుతుందని, 225 ఎకరాలున్న వజ్రాలపాడు చెరువు మొదట నిండితే దాని ద్వారా వెల్దుర్తి, దుర్గి, బొల్లాపల్లి, పుల్లలచెరువు మండలాల్లో 60కి పైగా చెరువులు నిండుతాయని, తద్వారా భూగర్భ జలాలు పెరిగి 150 గ్రామాల్లో, తండాల్లో, 1.20 లక్షల ఎకరాలు సాగులోకి వస్తాయని వివరించారు. నాలుగున్నర లక్షల మంది రైతులు లబ్ధి పొందటమే కాక ఈ ప్రాజెక్టు పూర్తయితే విద్య, వైద్య, రవాణ, పారిశ్రామిక రంగాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. ఈ విషయాలన్నింటినీ ప్రభుత్వం గమనంలోకి తీసుకోవాలని, ప్రాజెక్టుకు కేటాయించాల్సిన రూ.3500 కోట్లతో తొలి విడతగా రూ.1600 కోట్లు కేటాయించి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అప్పుడే ఈ ప్రభుత్వాన్ని ప్రజలు నమ్ముతారని, లేకుంటే గత ప్రభుత్వాలకు పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. సమావేశంలో రైతుసంఘం సీనియర్ నాయకులు బి.శంకరరావు, సిఐటియు మండల కన్వీనర్ పి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పిఆర్ విజ్ఞాన కేంద్రంలో కుట్టు శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి - యడ్లపాడు

మండల కేంద్రమైన యడ్లపాడులోని పోపూరి రామారావు విజ్ఞాన కేంద్రంలో కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. తానా ఫౌండేషన్ అధ్యక్షులు యర్లగడ్డ వెంకటరమణ సౌజన్యంతో ఏర్పాటు చేసిన శిక్షణను నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపాల్ సిహెచ్ సృజన ఆదివారం ప్రారంభించారు. శిక్షణ కోసం మిషన్లను సమకూర్చిన వారికి సిపిఎం సీనియర్ నాయకులు ఎన్.కాళిదాసు కృతజ్ఞతలు తెలిపారు. మహిళలు ఆర్థికంగా తమ కాళ్లమీద తాము నిలబడ్డానికి ఈ శిక్షణ దోహదపడుతుందని అన్నారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్.విజయలక్ష్మీ, ఎం.సుబ్బరావమ్మ, ఎం.రవీంద్ర, కె.రామబ్రహ్మం, ఎం.పద్మారావు పాల్గొన్నారు.

240 మందికి బీపీ, షుగర్ వైద్యసేవలు

ప్రజాశక్తి - యడ్లపాడు

బీపీ, షుగర్ రోగులకు యడ్లపాడు అభివృద్ధి కమిటీ, లింగారావుపాలెం విజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని మండల కేంద్రమైన యడ్లపాడులోని పిఆర్ విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. 240 మందికి పరీక్షలు చేసి రెండు నెలలకు సరిపడా మందులను ఉచితంగా అందించారు. రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మాజీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మరదాపు నాగేశ్వరావు పరీక్షలు చేయడంతోపాటు జూనియర్ డాక్టర్లకు పలు సూచనలు చేశారు. జూనియర్ డాక్టర్లు గుంటుపల్లి భవ్యతేజ, చెన్నుపాటి తేజశ్రీ, సొంటినేని నవ్యశ్రీ వైద్యసేవలు అందించారు. జి.కిరణ్, సిహెచ్.పూర్ణచంద్రరావు, ఎం.రవీంద్రబాబు, కె.రామబ్రహ్మం, పి.శ్రీనివాసరావు, బి.రాజేష్‌కుమార్, ఎ.వంశీ, ఎం.వేణుగోపాల్, ఎస్.శ్రీనివాసరావు, ఆర్.సుమన్, కె.రామోజీరావు, ఆర్.సురేష్ పాల్గొన్నారు.

గీతమ్స్‌లో టాలెంట్ టెస్ట్‌కు విశేష స్పందన

ప్రజాశక్తి - వినుకొండ

జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని గీతమ్స్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఆదివారం సిద్ధార్థ నగర్‌లోని గీతమ్స్ ఐఐటి క్యాంపస్ నందు నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌కు విశేష స్పందన లభించింది. వెయ్యి మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారని గీతమ్స్ విద్యాసంస్థల కరస్పాండెంట్ మాలపాటి కోటిరెడ్డి తెలిపారు. ఈ టాలెంట్ టెస్ట్‌లో 3వ తరగతి నుండి 5వ తరగతి వరకు ఒక విభాగంగా, 6వ తరగతి నుండి 9వ తరగతి వరకు విద్యార్థులు మరొక విభాంగా పాల్గొన్నారు. పరీక్ష రుసుమేమీ లేకుండా ఉచితంగా నిర్వహించినట్లు చెప్పారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతోపాటు మరో ఇద్దరికి కన్సోలేషన్ బహుమతులు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎం.కృష్ణవేణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు వంద పడకలతో ఆస్పత్రి ప్రారంభం

జూన్ నాటికి అన్ని సదుపాయాలతో మెడికల్ కాలేజీ, ఆస్పత్రి : ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పల్నాటి ప్రాంతానికి తోరణంలా వైఎస్ఆర్ మెడికల్ కళాశాల ఏర్పడబోతుందని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని కామేపల్లి వద్ద మెడికల్ కళాశాల తొలి విడతగా వంద పడకలతో ఏర్పాటు చేసిన ఆస్పత్రిని సోమవారం ప్రారంభిస్తామని చెప్పారు. ఆస్పత్రిని ఆదివారం పరిశీలించిన సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో పల్నాడు ప్రజలకు ఏ వైద్య సౌకర్యం అవసరమైనా నరసరావుపేట లేదా గుంటూరు, హైదరాబాద్, విజయవాడ వంటి ప్రాంతాలకి వెళ్లాల్సి ఉండేదని, నేడు ఆ పరిస్థితి ఉండబోదని చెప్పారు. కాలినొప్పి దగ్గర నుండి గుండె నొప్పి వరకు క్యాన్సర్ సహా అన్ని రోగాలకు వైద్య చికిత్సలు అందించబోతున్నామని అన్నారు. జూన్ నాటికి అన్ని రకాల సౌకర్యాలతో వైద్య సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. పిడుగురాళ్ల పట్టణ ప్రజలకు శాపంగా మారిన ట్రాఫిక్ సమస్యను తీర్చేందుకు బైపాస్‌ను కూడా పూర్తి చేశామని, త్వరలోనే దాన్ని ప్రారంభిస్తామని చెప్పారు. పట్టణంలో మహాత్మా జ్యోతిరావు పూలే, మహాత్మా గాంధీ, బాబూ జగ్జీవన్‌రామ్, చాకలి ఐలమ్మ, వంగవీటి మోహన్‌రంగా విగ్రహాలను ఆవిష్కరించనున్నామని, ముఖ్యఅతిథులుగా వైసిపి నరసరావుపేట ఎంపీ అభ్యర్థి అనిల్ కుమార్ యాదవ్ హాజరవుతారని ప్రకటించారు.

ఆర్టీసీ ఉద్యోగులకు విలీనానికి ముందు సదుపాయాలను అమలు చేయాలి

ప్రజాశక్తి - వినుకొండ

ఆర్టీసీ ఉద్యోగులకు విలీనానికి ముందున్న వైద్య సౌకర్యాలు కల్పించాలని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదర్‌రావు డిమాండ్ చేశారు. వినుకొండ ఆర్టీసీ డిపో యూనియన్ విస్తృత సమావేశం స్థానిక కారంపూడి రోడ్డులోని ఫంక్షన్ హాలులో ఆదివారం నిర్వహించారు. సమావేశానికి డిపో అధ్యక్షులు టి.జి.విన్సెంటివ్ అధ్యక్షత వహించారు. దామోదరరావు మాట్లాడుతూ విలీనానికి ముందున్న కొన్ని అలవెన్సులు, ఇన్సెంటివ్‌లు, వైద్యసదుపాయాలు పాతపద్ధతిలో లేకుండా చేయడం వల్ల ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. మహిళా కండక్టర్లకు ప్రతినెలా ఇచ్చే హెల్తు అలవెన్సును 200, మెంటినెన్సు సిబ్బందికి ఇచ్చే టెక్నికల్ అలవెన్సు రూ.200 పునరుద్ధరించాలన్నారు. 2017 పిఆర్‌సి బకాయిలు చెల్లించాలని కోరారు. నాలుగేళ్ల లీవ్ ఎన్‌క్యాష్‌మెంటు,పెండింగు డిఎ, 11వ పిఆర్‌సి బకాయిలు ఇవ్వాలన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.శంకరరావు మాట్లాడుతూ అధికారులు కొంతమంది ఇష్టానుసారంగా పనిష్మెంట్లు ఇస్తున్నారని, వాటిని మానుకోవాలని కోరారు. సమావేశంలో పి.సాంబశివరావు, నాయకులు వి.రమేష్, ఎన్.కోటేశ్వరరావు, బి.కోటేశ్వరరావు, ఎస్‌కె.ఖాజా, కార్యదర్శి జి.టి.రావు పాల్గొన్నారు.

రాయిని శిల్పంగా మార్చగల వడ్డెరలు : పెమ్మసాని చంద్రశేఖర్

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

ఇంజినీర్లతో పోటీ పడగల నైపుణ్యం వడ్డెరలకు ఉందని టిడిపి నాయకులు డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఆదివారం జరిగిన వడ్డెర యువగర్జనకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ భార్యాభర్తలు కష్టపడ్డా ఇల్లు గడవని దుస్థితిలో వడ్డెరలుఉన్నారన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి టిడిపి కృషి చేస్తుందని, వడ్డెరల సమస్యలను చంద్రబాబు, లోకేష్, పవన్‌ల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. తానూ పేద కుటుంబం నుండి వచ్చిన వాణ్ణేనని, పట్టుదలతో కృషి చేస్తే ఎంత ఎత్తుకైనా ఎదగవచ్చని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్, బిజెపి నాయకులు వి.జయప్రకాష్ నారాయణ, వడ్డెర కార్పొరేషన్ చైర్‌పర్సన్ దేవళ్ల రేవతి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని గ్రామాల్లో అర కోరా జీతాలతో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఇస్తున్న జీతాలు సరిపోక ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నారని రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు ఎం రవి అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో రాజధాని ప్రాంత పారిశుధ్య కార్మికుల విస్తృత సమావేశం జరిగింది. రవి మాట్లాడుతూ,పేరుకే అమరావతి నగరం.. పారిశుధ్య కార్మికులకు మాత్రం రూ 12 వేల జీతం మాత్రమే ఇస్తున్నారని, వీటిలో కూడా పీఎఫ్, ఈఎస్ఐ మినహాయింపులు పోగా రూ 10 వేలు కూడా కార్మికుల చేతికి రావడం లేదన్నారు. అవి కూడా సమయానికి చెల్లించకపోవడంతో అప్పుల ఊబిలో కార్మికులు కూరుకుపోయి అర్ధాకలితో పనులు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజధాని పారిశుధ్య కార్మికులకు కూడా మున్సిపల్ కార్మికులకు ఇస్తున్న విధంగా రూ 21 వేల జీతం ఇవ్వాలని, కార్మికులందరినీ ఆప్కాస్ లోకి తీసుకొని వారికి పని భద్రత కల్పించాలని రవి డిమాండ్ చేశారు. తక్షణం పెండింగ్ పీఎఫ్ చెల్లించేందుకు అధికారులు చొరవ చెయ్యకపోతే విజయవాడ సిఆర్డిఏ కార్యాలయం వద్ద ఆందోళన చేపడుతామని రవి హెచ్చరించారు. ఏ గ్రామంలో పనిచేసే కార్మికులను ఆ గ్రామంలోనే పని చేయించాలని కోరారు. కొందరు సూపర్వైజర్లు పారిశుధ్య కార్మికులను బానిసల కన్నా హీనంగా చూస్తున్నారని, తేలిక చేసి మాట్లాడుతున్నారని, చీటికి మాటికి పనులకు రావద్దు అంటూ బెదిరింపులకు దిగుతున్నారని, అత్యవసర సమయాల్లో కూడా సెలవులు ఇవ్వమంటూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని, తెల్ల పేపర్ల పై సంతకాలు చేయించుకుంటున్నారని, వీరి పద్ధతి చూస్తుంటే బ్రిటిష్ పాలకుల కన్నా ఘోరంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కార్మికులపై వేధింపులు మానుకోకపోతే ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని రవి హెచ్చరించారు. సమావేశంలో సిఐటియు నాయకులు పేరం బాబురావు, సంఘం నాయకులు సుశీల, మరియదాసు, జ్యోతి, మరియమ్మ, సుఖ వేణి, బుజ్జి, కోటేశ్వరరావు, శిరీష, ముత్యాలు, మరియరాణి పాల్గొన్నారు

సమావేశంలో మాట్లాడుతున్న ఎం రవి

హాజరైన పారిశుధ్య కార్మికులు

తెనాలి సీటుపై ఆలపాటి కినుక

టిడిపి అధినేత చంద్రబాబు పిలుపు - భవిష్యత్‌కు హామీ

ప్రజాశక్తి తెనాలి

టిడిపి, జనసేన ఉమ్మడిగా ప్రకటించిన తొలి జాబితాలో సీటు దక్కకపోవటంతో మాజీ మంత్రి ఆలపాటి కినుక వహించారు. పొత్తులో భాగంగా తెనాలి నియోజకవర్గం అభ్యర్థిగా నాదెండ్ల మనోహర్‌ను జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రకటించిన సంగతి తెలిసిందే. పార్టీలో సీనియర్‌గా ఉండి, పార్టీ భవిష్యత్ కోసం ఎంతగానో శ్రమించిన ఆలపాటికి సీటు దక్కవపోవటం పట్ల ఆయనతో పాటు ఆయన అనుచర గణం కూడా తీవ్ర అసంతృప్తిలో ఉంది. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం తెనాలి నుంచి పెద్దఎత్తున నాయకులు గుంటూరులోని ఆలపాటి నివాసానికి వెళ్ళారు. సీటు రాకపోవటం, భవిష్యత్ కార్యాచరణపై వారి ఆలోచనా విధానాన్ని వారు ఆయన ముందుంచారు. ఈ సందర్భంగా చంద్రబాబు నుంచి తనకు పిలుపు వచ్చిందని, పార్టీ అధిష్టానానికి విరుద్ధంగా ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని ఆయన వారికి సముదాయించినట్లు సమాచారం. అలాగే ఆయన చంద్రబాబును ఉండవల్లిలోని ఆయన నివాసానికి వెళ్ళి కలిశారు. పార్టీలో సీనియర్ నాయకుడిగా సర్దుబాట్ల పరిస్థితిని అర్థం చేసుకోవాలని చంద్రబాబు ఆలపాటిని కోరారు. రాష్ట్ర భవిష్యత్ కోసం, వైసిపి విముక్త ఆంధ్రప్రదేశ్ కోసం పొత్తు అనివార్యమైందని, అంతా సహకరించాలని నచ్చజెప్పినట్లు తెలిసింది. అలాగే పార్టీ అధికారంలోకి రాగానే తగిన ప్రత్యామ్నాయం చూపుతామని భరోసా కల్పించినట్లు పార్టీ వర్గాలకు ఆలపాటి సమాచారం ఇచ్చారు. వాస్తవానికి తెనాలి నుంచి ఇండిపెండెంట్‌గా నైనా పోటీ చేసేందుకు సిద్ధమైన ఆయన అధినేత చంద్రబాబు నాయుడు బుజ్జగింపుతో వెనక్కు తగ్గారు. ఇక పార్టీ గెలుపుకు పనిచేసే విదానంపై కూడా కొన్ని సూచనలు చేసినట్లు తెలిసింది.

చంద్రబాబు నివాసానికి వెళుతున్న ఆలపాటి

బండి లక్ష్మి కుటుంబాన్ని పరామర్శిస్తున్న సిపిఎం నాయకులు

రక్షితనీరు అందించాలి : సిపిఎం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

స్థానిక గురవయ్య కాలనీలో వాంతులు, విరోచనాలతో ఇటీవల మృతి చెందిన బండి లక్ష్మీ కుటుంబ సభ్యులను సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్ భావన్నారాయణ, తెనాలి కమిటీ కార్యదర్శి కొల్లిపర బాబుప్రసాద్, డివిజన్ నాయకులు ఎస్ సుబ్రమణ్యం ఆదివారం పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతు కాచి చల్లార్చిన నీరు తాగే అలవాటు వుండికూడా ప్రాణనష్టం జరగడం బాధాకరమన్నారు. ఈ ప్రాంతంలో నీరు పచ్చని రంగును కలిగి వాసన వస్తున్నట్లు నిర్వాసితులు పిర్యాదు చేసారన్నారు. కాలనీ పరిసర ప్రాంతాల్లో తాగునీటిని వంటలకు ఉపయోగిస్తే వ్యాధులు ప్రభలే అవకాశముందని తెలిపారు. ప్రభుత్వ రక్షిత మంచినీటిని క్రమం తప్పకుండా సరఫరా చేయాలని మున్సిపల్ అధికారులను కోరారు. మరణించిన లక్ష్మి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న టిడిపి నాయకులు

ఎంపీ అనుచరులపై చర్యలు కోసం ఫిర్యాదు

ప్రజాశక్తి-తాడేపల్లి

వైసిపి ఎంపి నందిగామ సురేష్‌పై చర్యలు తీసుకోవాలని ఆదివారం టిడిపి నాయకులు తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శనివారం అమరావతి కరకట్టపై ఏర్పాటు చేసిన టిడిపి ఫ్లెక్సీలను నందిగామ సురేష్ అనుచరులు చించివేసి తీసేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు మాట్లాడుతూ నందిగం సురేష్ అనుచరులు కర్రలు, రాడ్లతో వీధి రౌడీల్లాగా వ్యవహరించి టిడిపి ఫ్లెక్సీలు తొలగించడం పిరికిపంద చర్య అని విమర్శించారు. ఎంపి అనుచరులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు దారా దాసు, ఎ.కుసుమ, సీనియర్ నాయకులు కేళి వెంకటేశ్వరరావు, ఒ.రాము, ఇ.భాస్కర్, మహాలక్ష్మి, పుల్లారెడ్డి, పెంచలయ్య, మురళీ, మరియదాసు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్ష

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణంలో గ్రూప్ 2 పరీక్ష మూడు కేంద్రాల్లో ఆదివారం నిర్వహించారు. పట్టణ సీఐ ఎం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. నిర్మలా జూనియర్ కళాశాలలో 350 గాను 69 మంది విద్యార్థులు హాజరు కాలేదు. సి కె జూనియర్ కళాశాలలో 250 మందికి గాను 49 మంది హాజరు కాలేదు. వీటిజేఎం అండ్ ఐ వి టి ఆర్ డిగ్రీ కళాశాల సెంటర్లో 350 మందికి గాను 51 మంది విద్యార్థులు హాజరు కాలేదు. ఆయా కళాశాల ప్రిన్సిపల్ పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించారు.

నిర్మలా జూనియర్ కళాశాల వద్ద హాల్ టికెట్ పరిశీలించి పరీక్షా కేంద్రం లోపలికి పంపుతున్న పట్టణ సీఐ

నెహ్రూ నికేతన్‌లో సందడిగా ఫేర్‌వెల్ డే

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక బోస్ రోడ్ లోని నెహ్రూ నికేతన్ జూనియర్ కళాశాలలో ఇంటర్ సీనియర్ విద్యార్థుల ఫేర్వెల్ వేడుకలు ఆదివారం రాత్రి నిర్వహించారు. విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ మురళీకాంత్ దాసరి పర్యవేక్షణలో విద్యార్థిని, విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. పండుగ వాతావరణం లో సందడి చేశారు. పాత పాటలకు డీజే మ్యూజిక్ జోడించి డాన్సులతో హోరెత్తించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన ఆటలు, పాటల పోటీలలో విజేతలకు మురళీకాంత్ దాసరి బహుమతులు అందజేశారు. పబ్లిక్ పరీక్షలకు అతి తక్కువ సమయం ఉన్న నేపథ్యంలో ప్రణాళిక బద్ధంగా సమయం కేటాయించి, మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని సూచించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల వ్యవస్థాపకులు ప్రకాశరావు దాసరి, ప్రిన్సిపల్ వి శేషగిరిరావు, వైస్ ప్రిన్సిపల్ పి నాగ శంకర్, అధ్యాపకులు పాల్గొన్నారు

ఎయిమ్స్ హాస్పటల్ ఆవరణలో ఏర్పాటు చేసిన సభకు బస్సుల్లో తరలించిన జనాలు

ప్రధాని మోడీ వస్తున్నారంటూ నమ్మించి

ఎయిమ్స్ సభకు జనాల తరలింపు

ప్రజాశక్తి మంగళగిరి :మంగళగిరి ఎయిమ్స్‌ను ఆదివారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జాతికి అంకితం చేస్తూ వర్చువల్‌గా ప్రారంభ కార్యక్రమం ఎయిమ్స్‌లో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, బిజెపి ఎంపీలు, నాయకులు పాల్గొన్నారు. ఈ సభకు ఆర్టీసీ బస్సులు పెట్టి గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాలో ఉన్న యూనివర్సిటీ విద్యార్థులను, డ్వాక్రా మహిళలను బస్సుల్లో తరలించారు. డాక్రా మహిళలకు ఒక్కొక్కళ్ళకి రూ.300 కూడా ఇచ్చినట్లుగా సమాచారం. ప్రధాని మోడీ వస్తున్న సందర్భంగా జరిగే సభ అని చెప్పి తీసుకురావడం జరిగింది. ప్రైవేట్ యూనివర్సిటీల విద్యార్థులను కూడా తరలిం చారు. వారికి సరైన సౌకర్యాలు కల్పించకపోవడంతో సభ ప్రారం భం కాగానే కొద్దిసేపటికి బయటకు వచ్చి వెళ్లిపోయారు. అయితే బస్సులు వెంటనే బయలుదేరకపోవడంతో ఇబ్బందులు పడ్డారు.

ఫ్లెక్సీ ఏర్పాటు ఉద్రిక్తతం

ప్రజాశక్తి మంగళగిరి: మంగళగిరి ఎయిమ్స్‌లో ఆదివారం ప్రధాని నరేంద్ర మోడీ జాతికి ఎయిమ్స్ అంకితం చేసే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమం సమీపంలో గొప్ప అవకాశం అంటూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఇక్కడ ఎయిమ్స్ ఆస్పత్రికి, కళాశాలకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రూ.16 83 కోట్లు కేటాయించి నిర్మాణం జరిగిందని ఫ్లెక్సీలో రాశారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి జగన్మోహన్ రెడ్డి ఎయిమ్స్ అభివృద్ధికి ఎలాంటి నిధులు ఇవ్వలేదని జీరో అని చూపిస్తూ పెట్టారు. ఈ ఫ్లెక్సీని తాడేపల్లి మధుసూదన్ రావు తొలగించడం జరిగింది. దీంతో బిజెపి కార్యకర్తలు సీఐతో వాగ్వాదానికి దిగారు. పావు గంట సేపు సిఐ పై బిజెపి కార్యకర్తలు దురుసుగా ప్రవర్తించినప్పటికీ సిఐ వెనుక తగ్గకుండా సమాధానం చెప్పడం జరిగింది. కొంతసేపటికి వివాదం ముగిసింది.

తాడేపల్లి సిఐ మధుసూదన్‌రావు తో బిజెపి కార్యకర్తల వాగ్వాదం

రక్తహీనతతో అనారోగ్య సమస్యలు

వడ్డేశ్వరంలో రక్తపరీక్షలు నిర్వహించిన కెఎల్‌యు విద్యార్థులు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

రక్తహీనతతో పలు అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని కెఎల్ వర్సిటీ ఫార్మసీ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్ సుప్రియ తెలిపారు. ఆదివారం కెఎల్‌యు ఫార్మసీ విద్యార్థులు ఎంటిఎంసి పరిధిలోని వడ్డేశ్వరంలో గ్రామస్తులకు రక్తహీనత సమస్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో గ్రామస్తులకు రక్త పరీక్షలు నిర్వహించి హెచ్‌బి శాతం, బ్లడ్ గ్రూప్ తెలియజేసినట్లు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ పి. శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర సుప్రియ మాట్లాడుతూ రక్తహీనతతో అలసట, నీరసం, పాలిపోయినట్లు ఉండటం, కళ్లు తిరగటం వంటి సమస్యలకు గురవుతారన్నారు. తాజా ఆకుకూరలు, పండ్లు ఆహారం భాగం చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ బ్లడ్ గ్రూపు తెలుసుకుని ఉండటం అవసరమని తెలిపారు. ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను విసి డాక్టర్ జి పార్థసారథివర్మ, ప్రొఫెసర్ ఎవిఎస్ ప్రసాద్, డాక్టర్ హబీబుల్లాఖాన్ తదితరులు అభినందించారు.

ఎమ్మెల్యేను కలిసిన విద్యార్థి విభాగం కార్యదర్శి

ప్రజాశక్తి - బెల్లంకొండ

మండలంలోని నాగి రెడ్డిపాలేనికి చెందిన వజ్రాల శ్రీని వాస్‌రెడ్డి (డైమండ్) వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పల్నాడు జిల్లా విద్యార్థి విభాగం కార్యదర్శిగా నియ మించినందుకు పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావును ఆదివారం కలిసి కృతజ్ఞ తలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీని వాస్‌రెడ్డిని ఎమ్మెల్యే సత్కరించారు. ఎన్నికలు సమీపిస్తున్నం దున వైసిపి నాయకులు, కార్యకర్తలు ప్రచారంపై దృష్టి పెట్టా లని సూచించారు. వచ్చే ఎన్నికల్లో అందరూ కలిసికట్టుగా పనిచేసి పెదకూరపాడు నియోజకవర్గంలో వైసిపి జెండా ఎగురవేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని శంకరరావు సూచించారు.

సాతులూరులో ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి-నాదెండ్ల

మండలంలోని సాతులూరులో ఐనవోలు రామలింగం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిభిరం నిర్వహించారు. శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయంలో ఈ వైద్య శిబిరం ప్రారంభించారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ యలవర్తి వరబాబు,డాక్టర్ గంగూరి సుప్రజ, డాక్టర్ చేకూరి రవి తేజ వైద్య సేవలు అందించారు. ముఖ్య అతిథులుగా నాదెండ్ల మండల టిడిపి అధ్యక్షులు బి.సత్య నారాయణ ట్రస్ట్ సభ్యులు ఐనవోలు రాధాకృష్ణ, మాజీ ఎంపిటిసి ఎన్.శివయ్య, జె.మణిదీప్, సాతులూరు పంచాయతి వార్డు సభ్యులు ఐనవోలు రాజా పాల్గొన్నారు. క్యాంప్‌లో మొత్తం 250 మందికి వైద్య సేవలందించి, అవ సరమైన వారికి మందులు పంపిణి చేశారు.

స్కాలర్‌షిప్ పంపిణీ చేస్తున్న జీవీ ఆంజనేయులు

చదువుతోనే మంచి భవిష్యత్తు

ప్రజాశక్తి-ఈపూరు

చదువుతూనే మంచి భవిష్యత్తు లభిస్తుందని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. మండలంలోని తన సొంత గ్రామం ఇనిమెల్లలో శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీ గోనుగుంట్ల సత్యనారాయణ స్కాలర్షిప్ లను విద్యార్థులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జీవి ఆంజనేయులు మాట్లాడుతూ ఉన్నత చదువులకు తల్లిదండ్రులు విద్యార్థులను ప్రోత్సహించాలని కోరారు. పేద విద్యార్థులకు శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ సహకారం ఉంటుందన్నారు.అనంతరం గ్రామస్తులతో సమావేశం నిర్వహించి గ్రామ సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా అధికార ప్రతినిధి ఆర్.జగ్గారావు, నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షులు గోవింద రాజులు, టిడిపి మండల అధ్యక్షులు టి.బాలయ్య,ఐ కోటేశ్వరరావు, సర్పంచ్ జి.శ్రీనివాసరావు, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు ఎన్.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవం

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే

రాజకీయ అరంగ్రేటం నుండి తన గెలుపునకు ముస్లిం మైనార్టీలు వెన్ను దన్నుగా నిలిచారని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. ముస్లింల కోసం ముస్లిం సద్భవన్ (కమ్యూనిటీ హాల్) ను ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్గోపిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ముస్లింలకు వైసిపి ప్రభుత్వం గౌరవప్రదమైన పదవులు ఇస్తూ వస్తోం దన్నారు. 2024 ఎన్నికలలో మొదటి విడతగా ముస్లిం మైనారిటీలకు 7 సీట్లు ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందన్నారు. నియోజకవర్గంలోని నరసరావు పేట ఆర్టీసీ బస్టాండ్ పక్కన, జొన్నలగడ్డ దగ్గర మసీదులను ఏర్పాటు చేశామని తెలి పారు. ముస్లింలకు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

యువత ఓటుతో అరాచకపాలనను అంతమొందించాలి

ప్రజాశక్తి - నరసరావుపేట

'మై ఫస్ట్ ఓట్ ఫర్ సిబిఎన్' లో పాల్గొన్న చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం నాడు ఏపీ వారియర్స్ ఆధ్వర్యంలో మై ఫస్ట్ ఓటు ఫర్ సిబిఎన్ అనే కార్యక్రమాన్ని నిర్వ హించారు.ఈ కార్యక్రమానికి నియోజక వర్గ వ్యాప్తంగా ఉన్న విద్యార్థులు, పట్ట భద్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఏపీ వారియర్స్ మొదటి ఓటు ప్రాధాన్యతను వివరిస్తూ జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రానికి చేసిన అన్యాయాన్ని యువకులకు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతి థిగా నరసరావుపేట నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ డాక్టర్ చదలవాడ అరవింద బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క అవకాశం అంటూ జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చి అన్ని వర్గాలను దగా చేశారని విమర్శించారు. రాష్ట్రంలో అభివృద్ధి అనే పదానికి తావు లేకుండా రాక్షస పాలన సాగించారని ఆరో పించారు. ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ అంటూ ఆశ చూపించి అధిక ారంలోకి వచ్చిన జగన్, అధికారంలోకి వచ్చాక సాక్షిలో పని చేసే జీతగాడు సజ్జల రామకృష్ణారెడ్డికి సలహా దారుడు పోస్ట్,వైసీపీ కార్యకర్తలకు వాలంటరీ పోస్టులు తప్ప నిరుద్యోగులకు ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. వైసిపి దొంగల ముఠా ప్రతి నియోజకవర్గంలో పదివేల దొంగ ఓట్లు నమోదు చేసి గెలవడం కోసం కుట్ర రాజకీయాలు చేస్తోందని యువకులు, ఈ కుట్ర రాజకీయాలను తిప్పి కొట్టాలన్నారు. పద్దెనిమిదేళ్ళు నిండిన యువత తమ ఓటు హక్కు నమోదు చేయించుకోవాలని, దొంగ ఓట్లను గుర్తించి వాటిని తొలగించేందుకు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. 'ఓటు' అనే వజ్రాయుధంతో రాష్ట్రంలో అరాచకపాలన సాగిస్తున్నా వైసిపి పాలనను అంతం చేయాలని యువతను కోరారు. అన్ని వర్గాల సంక్షేమం చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని, టిడిపిని గెలిపించేందుకు మొదటి ఓటును ఉపయోగించాలని యువతను కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కె.లక్ష్మీ, పి.సునీల్, మీరవాలి, కె.కోటిరెడ్డి,మొహమ్మద్ రఫీ,ఎ.సుబ్బారావు, జి. సత్యనారాయణ, సత్య నారాయణ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-రొంపిచర్ల

రొంపిచర్ల మండలం సంతగుడిపాడు ఎస్టీ కాలనీలో టిడిపి కార్యకర్త రామ కోటయ్య ఇల్లు షార్ట్ సర్క్యూట్ తో పూర్తిగా కాలిపోయింది. ఈ విషయం తెలుసుకున్న నరసరావుపేట నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ చదల వాడ అరవింద బాబు ఆయనకు ఆర్థిక సాయం అందించారు. రామకోటయ్యను పార్టీ అన్ని విధాల ఆదుకుంటుందని భరోసా యిచ్చారు. బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎం. వెంకటేశ్వం రెడ్డి, పి.నాగిరెడ్డి, జి.శేఖర్, ఎం. కొండలు, యు. వెంకటేశ్వర్లు, కె.శ్రీనివాస్‌రావు, రసూల్ పాల్గొన్నారు.

కాపులకు వెన్నుపోటు పొడిచిన జగన్: టిడిపి

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

నాడు టిడిపి ప్రభుత్వం కాపులకు కల్పించిన 5 శాతం రిజర్వేషన్లను రద్దు చేయడంతో వారికి వెన్నుపోటు పొడిచారని ముఖ్యమంత్రి జగన్‌పై పల్నాడు జిల్లా టిడిపి అధికార ప్రతినిధి కంభాల వెంకటేశ్వరరావు విమర్శించారు. సత్తెనపల్లి రఘు రాంనగర్‌లోని టిడిపి ప్రజా వేదికలో టిడిపి, జన సేన నాయకులు ఆదివారం మాట్లాడుతూ పవన్‌కళ్యాణ్ కాపులకు వెన్నుపోటు పొడి చారన్న మంత్రి అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా ఖండించారు. కాపు కార్పొరేషన్ నిధులను పక్కదారి పట్టించి కాపుల ప్రయోజనాలకు తూట్లు పొడిచి కాపుల అభివద్ధిని అడ్డుకున్న వైసిపిలో మంత్రిగా ఉన్న అంబటి రాంబాబుకు కాపుల పేరు ప్రస్తావించే అర్హత లేదని అన్నారు. కులాలను రెచ్చగొట్టి ఓట్లు పొం దాలన్న కుటిల ప్రయత్నాలు మానుకుని మంత్రిగా రాష్ట్రానికి, సొంత నియోజకర్గానికి ఏమి చేశారో చెప్పుకుని ఓట్లు అడిగితే మంచిదని హితవు పలికారు. రాజకీయాలు మానుకుని రికార్డ్ డాన్స్ ట్రూప్ ను నడుపుకుంటే రానున్న వేసవికాలం పల్నాడు ప్రాంతంలో ప్రతి గ్రామంలో జరగనున్న తిరునాళ్ళలో అటు ప్రజలకు వినోదం, ఇటు అ ంబటి రాంబాబు కు ఆదాయం కూడా దొరుకు తాయని ఘాటు విమర్శలు చేశారు. సమావేశంలో పల్నాడు జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు బత్తుల ఆదినారయణ, జనసేన పార్టీ ఉమ్మడి గుంటూరు జిల్లా అధికార ప్రతినిధి టి.భావనారాయణ టిడిపి నాయకులు టి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ లో అభివృద్ధి పనులు నేడు ప్రారంభం

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

రైల్వేస్టేషన్ లో ఏర్పాటు చేసిన డిజిటల్ తెర

సత్తెనపల్లి రైల్వేస్టేషన్ లో జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ వర్చువల్ విధానంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభించనున్నారు.

ఈ విషయాన్ని రైల్వే అధికారులు ఆదివారం తెలిపారు. అమృత భారత్ స్టేషన్ పథకంలో భాగంగా సత్తెనపల్లి రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. రైల్వే ప్రయాణికుల సౌక ర్యార్థం లిఫ్ట్ సౌకర్యం, ప్లాట్ ఫామ్ విస్తరణ తదితరులు పనులు చేపట్టారు. అభివృద్ధి పనులను మోడీ ప్రారంభించనున్న నేపథ్యంలో శిలాఫలకాన్ని డిజిటల్ తెరను ఏర్పాటు చేశారు.

త్రిపురాపురంలో ఆర్ఓ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి-వినుకొండ

నూజెండ్ల మండలంలోని త్రిపురాపురంలో బాల వికాస్ ఆర్వో ప్లాంట్ ను వైఎస్ఆర్ రాష్ట్ర ట్రేడ్ యూనియన్ సెక్రటరీ జక్కిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. 500 లీటర్ల సామర్థ్యం గల ఈ ఆర్ఓ ప్లాంట్ ను సర్పంచ్ జి.బ్రహ్మారెడ్డి,వికాస్ మేనేజర్ మోహన్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులకు తాగునీటి అవసరాలను తీర్చేందుకు ఆర్వో ప్లాంటును గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ప్రభాకర్‌రెడ్డిని, బ్రహ్మారెడ్డి తో పాటు గ్రామస్తులు సత్కరించారు. కార్యక్రమంలో ఎ.రామాంజిరెడ్డి, జి.బ్రహ్మారెడ్డి, టి. కృష్ణారెడ్డి, కె.హనుమంతరావు పాల్గొన్నారు.

సత్తెనపల్లి మండలం భీమవరంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న కన్నా లక్ష్మీనారాయణ

తప్పుడు హామీలతో మోసం: కన్నా లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

తప్పుడు హామీలతో అన్ని వర్గాల ప్రజలను సిఎం జగన్ మోసం చేస్తున్నారని సత్తెనపల్లి నియోజకవర్గం టిడిపి అభ్యర్థిగా కన్నా లక్ష్మీనారాయణ విమర్శించారు. సత్తెనపల్లి మండలం భీమవరంలో కన్నా లక్ష్మీనారాయణ ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కన్నా లక్ష్మీనారాయణ కు టిడిపి,జనసేన నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు స్వాగతం పలికారు. ఎన్టీఆర్, కోడెల విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ ఎస్సీ,ఎస్టీ,బిసి,మైనారిటీ అన్ని వర్గాలకు తప్పుడు హామీలు ఇచ్చి మోసం చేశాడని ఎన్నికల సమయంలో 'యుద్ధం సిద్ధం' అని ప్రగల్బాలు పలుకుతూ ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి బి.వందనాదేవి, పల్నాడు జిల్లా అధికార ప్రతినిధులు ఎ.సాంబయ్య, కె.వెంకటేశ్వర్లు, డి. శ్రీనివాస రావు, బీసీ సెల్ అధ్యక్షులు టి. వెంకటరావు, మండల పార్టీ అధ్యక్షులు ఎ. అమరేశ్వరరావు పాల్గొన్నారు.

800 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

ప్రజాశక్తి - మాచర్ల

వెల్దుర్తి మండలం కొత్తపుల్లారెడ్డి గూడెం సమీపంలోని అటవీ ప్రాంతంలో ఆదివారం స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో అధికారులు ఎనిమిది వందల లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఎస్ ఈ బి అధికారి సిఐ కిషోర్ తెలిపిన వివరాల ప్రకారం అందిన సమాచారం మేరకు దాడులు చేశామని, సారా తయారు చేసే వారు పారిపోయినట్లు చెప్పారు. నిందితులపై కేసులు నమోదు చేశామని, అరెస్ట్ చేయాల్సి ఉందని అన్నారు.

గాయత్రి నగర్‌లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థినులు

నీటి సంరక్షణపై అవగాహన

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక 25వ వార్డులోని జోసఫ్‌నగర్, కష్ణబాబు కాలనీలో గుంటూరు ప్రభుత్వ మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ డి.ధాత్రికుమారి ఆధ్వర్యంలో జరుగుతున్న స్పెషల్ క్యాంప్ మూడవ రోజు కార్యక్రమంలో భాగంగా నీటి సంరక్షణ, శుద్ధ జలంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. నీటి ద్వారా సంక్రమించే అతిసార వ్యాధి వంటి జబ్బులు వ్యాప్తి చెందకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో విద్యార్థులు ఇంటింటికి తిరిగి అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ధాత్రికుమారి మాట్లాడుతూ వర్షపు నీటిని ఇంకుడు గుంతల ద్వారా నిల్వచేసే పద్ధతులను గురించి వివరిస్తూ భూగర్భ నీటి వనరుల మట్టాన్ని పెంచడానికి ప్రతి ఒక్కరూ కషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ శ్రీలత పాల్గొని ప్రసంగించారు.

ఫోటో 5. మెయిన్ డ్రైన్ లో చెత్త నిండిపోయిన చిత్రం.

మెయిన్ డ్రెయిన్‌లో చెత్తా చెదారం

దుర్వాసన వస్తున్న పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి మంగళగిరి

మంగళగిరి పట్టణం లోని గౌతమ్ బుద్ధ రోడ్డు పడమర వైపు డ్రైన్‌లో ఎమ్మెల్యే కార్యాలయం సమీపంలో చెత్త కుప్పలు కుప్పలుగా ఉన్నప్పటికీ కార్పొరేషన్ అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతినిత్యం కార్పొరేషన్ అధికారులు, ప్రజా ఆరోగ్య అధికారులు అటు ఇటు తిరుగుతున్నారు తప్ప పట్టించుకోవడంలేదని విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు పట్టించుకోని చెత్తను తొలగించాలని ప్రజలకు కోరుతున్నారు.

పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఖురాన్ కంఠస్థ పోటీలు

ప్రజాశక్తి తెనాలి : స్థానిక నాజరు పేట ఎన్వీఆర్ కన్వెన్షన్‌లో ఆదివారం పట్టణంలోని 25 మసీదులకు చెందిన ఇమామ్‌లు, ముతవల్లీలు ఆధ్వర్యంలో దివ్య ఖురాన్ కంఠస్థ ప్రతిభ పోటీలు నిర్వహించారు. 1 నుంచి 6 తరగతులు చదివే విద్యార్థులు దాదాపు 300 మంది పాల్గొన్నారు. అనర్గళంగా ఖురాన్ అప్పజెప్పి అత్యంత ప్రతిభ కనబరిచిన 18 మంది విద్యార్థులకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. గత ఐదు సంవత్సరాలుగా ఖురాన్ కంఠస్థ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ముఫ్తీ అల్లావుద్దీన్, ఖారీ ఖమ్రుజ్ జామా, హఫీజ్ జుబేర్ సాహెబ్, ముఫ్తీ హైదర్ అలీ, సాహెబ్, హఫీజ్ ఇమ్రాన్ బేగ్, ఎస్ ఎం సుభాని, హఫీజ్ అబ్దుల్ కరీం, శ్రీ చక్ర వైద్యశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కమ్మెల శ్రీనివాసరావు, షేక్ నాజర్ అహ్మద్, ఖజూర్ సుభాని పాల్గొన్నారు

ముస్లిముల అభ్యున్నతికి వైసిపి ప్రభుత్వం కృషి

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

మాట్లాడుతున్న నూరి ఫాతిమా

ముస్లింలు అభివద్ధికి వైసిపి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని తూర్పు నియోజక వర్గం ఇంఛార్జి నూరి ఫాతిమా చెప్పారు. ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ గుంటూరు జిల్లా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో స్టేడియం వద్ద ఉన్న అంజుమాన్ షాది ఖానలో ఆత్మీయ సమావేశం జరిగింది. నూరిఫాతిమా మాట్లాడుతూ రాష్ట్రంలోని ముస్లింలకు రాజకీయ, ఆర్థిక, సామాజికపరంగా స్థాయిని, గుర్తింపును కల్పిస్తూ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని అమె తెలిపారు. గతంలో ముస్లింలకు 4 ఎమ్మెల్యే సీట్లను కేటాయిస్తే నేడు ఏకంగా 7 సీట్లు ఇవ్వడం హర్షించదగ్గ విషయమన్నారు. చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా ఉపముఖ్యమంత్రి పదవితో పాటు కేబినెట్ హోదా కలిగిన 12 కార్పొరేషన్లు కేటాయించారన్నారు. ముస్లింలు సుభిక్షంగా, సంతోషంగా ఉండేందుకు వారి హక్కులను పూర్తిగా గౌరవించి, అత్యున్నతస్థాయికి తీసుకెళ్లేందుకు కృషిచేస్తున్నందుకు అందరూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అండగా మరోసారి నిలవాలన్నారు. కార్యక్రమంలో ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు రఫీ , రాష్ట్ర ఉపాధ్యక్షులు ముస్తఫా మిర్జా బాబు,పఠాన్ జహీర్ ఖాన్, అంజుమాన్ గుంటూరు అధ్యక్షులు కర్నూమా, వైస్సార్సీపీ నరసరావుపేట అసెంబ్లీ పరిశీలికులు గులాం రసూల్ , ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు వివిధ రాజకీయ పార్టీల నేతలు పాల్గొన్నారు.

ఆటో నడుపుతున్న మంత్రి రజని, తదితరులు

ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి కృషి

- రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక పట్టాభిపురంలోని వైసిపి కార్యాలయంలో ఆదివారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని ఆటో డ్రైవర్లతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి రజిని మాట్లాడుతూ ఆటోడ్రైవర్లు నమ్మకానికి మరోపేరు అని, పిల్లలను పాఠశాలలకు పంపాలన్నా, ఆపద సమయంలో ఆస్పత్రులకు వెళ్లాలన్నా గుర్తొచ్చేది ఆటోవాలాలేనని అన్నారు. ఆటో డ్రైవర్ల సమస్యలను గుర్తించిన సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రతి ఆటో డ్రైవర్‌కు ఏటా రూ.10వేలు చొప్పున ఇస్తున్నారని అన్నారు. ఈ ఐదేళ్లలో పోలీసులు ఏ ఒక్క ఆటో డ్రైవర్‌పై ఎలాంటి కేసులు పెట్టలేదని, వేధింపుల ఊసే లేదని అన్నారు. సిగ్నల్ క్రాసింగ్ విషయంలో వేస్తున్న అపరాధ రుసుముల విషయంలో కొంత సడలింపు అవసరమని కొంతమంది ఆటో డ్రైవర్లు ఇటీవల తనను కలిశారని, తాను వెంటనే అధికారులను పిలిపించి తగిన ఆదేశాలు జారీ చేశానని, ఆటో డ్రైవర్ల విషయంలో పోలీసులు కఠినంగా ఉండొద్దని కూడా చెప్పానని తెలిపారు. ఆటో డ్రైవర్ల కోసం ప్రత్యేకంగా సొసైటీ ఏర్పాటు చేసేలా ప్రభుత్వం దృష్టికి తాను తీసుకెళతానని పేర్కొన్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి వచ్చే ఎన్నికల్లో తాను పోటీ చేస్తున్నానని, తనను ఆశీర్వదించాలని విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, మేయర్ కావటి మనోహర్‌నాయుడు పాల్గొన్నారు.పార్టీ ఆఫీసు నుండి స్థంబాల గరువు మీదుగా తిరిగి ఆఫీసు వరకూ నిర్వహించిన ఆటో ర్యాలీలో మంత్రి పాల్గొని స్వయంగా ఆటో నడిపారు. కార్యక్రమంలో నాయకులు రాతంశెట్టి సీతారామాంజినేయులు, ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, కార్పొరేటర్లు, ఇన్‌చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

తిరునాళ్లకు భారీ విద్యుత్ ప్రభలు

ప్రజాశక్తి - చేబ్రోలు

మహాశివరాత్రి, వడ్లమూడి క్వారీ తిరుణాళ్లకు సమీప గ్రామల్లో ప్రజలు భారీ స్థాయిలో విద్యుత్ ప్రభలు తయారు చేస్తున్నారు. నారాకోడూరు తెనాలి రోడ్డులో భారీ ఎత్తైన విద్యుత్ ప్రభ తో పాటు మరో 3 ప్రభలు గ్రామంలో సిద్ధమవు తున్నాయి. గొడవర్రు, గుండవరం, వేజెండ్ల, సుద్ధపల్లి, చేబ్రోలు గ్రామాల నుండి భారీ నిర్మాణాలతో తిరుణాళ్లకు తరలించడానికి సిద్ధం చేస్తున్నారు.

నేడు అనంతపురంలో కాంగ్రెస్ పార్టీ సభను జయప్రదం చేయండి

డాక్టర్ చందు సాంబశివుడు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

అనంతపురంలో నేడు కాంగ్రెస్‌పార్టీ నిర్వహిస్తున్న రాష్ట్ర పునఃనిర్మాణ పోరాట సభను విజయవంతం చేయాలని తెనాలి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి డాక్టర్ చందు సాంబశివుడు పిలుపునిచ్చారు. స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 26న కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, ఎపిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల హాజరుకానున్న సభను విజయవంతం చేయాలని తెలిపారు. అనంతపురంలో జూనియర్ కళాశాల మైదానంలో సాయంత్రం బహిరంగ సభ ఏర్పాట్లు పూర్తిచేసారన్నారు. కాంగ్రెస్ పార్టీ విధాన నిర్ణయాలను ఈవేదిక ద్వారా ప్రకటిస్తుందని పార్టీ పెద్దలు తెలిపారన్నారు. కార్యక్రమంలో తెనాలి టౌన్ ప్రెసిడెంట్ పొన్నూరు నాగ సూర్య శశిధర్, మండల ప్రెసిడెంట్ కర్లపూడి బుల్లియ్య, మాదల పూర్ణచంద్రావు, పి శివకుమార్, టి శివనరాయణ, పి స్టివెన్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

23వ వార్డులో గంజి చిరంజీవి పర్యటన

ప్రజాశక్తి మంగళగిరి

రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, మంగళగిరి ప్రాంతంలో జరిగిన అభివద్ధిని వివరిస్తూ వైఎస్ఆర్సిపి నియోజకవర్గ ఇన్చార్జ్ గంజి చిరంజీవి ఆదివారం మంగళగిరి పట్టణంలోని 23 వార్డులో పర్యటిం చారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డిని మరల సీఎంగా గెలిపించు కోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

కార్యకర్తలతో సిద్ధం అంటున్న ఎమ్మెల్యే

బ్రేక్ ఫాస్ట్ విత్ ఎమ్మెల్యే

ప్రజాశక్తి-తెనాలిరూరల్

స్థానిక బుర్రిపాలెం ఎఎస్ఎన్ ఇంజనీరింగ్ కళాశాలలో బ్రేక్ ఫాస్ట్ విత్ ఎమ్మెల్యే కొనసాగింది. ఆదివారం ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ నేతత్వంలో జరిగిన కార్యక్రమంలో తెనాలి పట్టణ 07, 08, 09, 10, 25 వార్డుల ముఖ్యనాయకులు పాల్గున్నారు. కౌన్సిలర్లు కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్స్, గృహ సారధులు, బూత్ లెవెల్ ఏజెంట్లు, మహిళా నాయకులు పాల్గొని ఎన్నికల పోరుకు సిద్ధం అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో అన్నాబత్తుని సత్యన్నారాయణ, మున్సిపల్ చైర్మన్ తాడిబోయిన రాధిక రమేష్, అక్కిదాసు కిరణ్ కుమార్, సునీల్, బండ్లమూడి భాస్కర్, మన్నవ ప్రభాకర్ పాల్గొన్నారు.

విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలి

ప్రజాశక్తి, పెదనందిపాడు

పుస్తక పఠనం వలన మానసిక ఉల్లాసం కలుగుతుందని, విషయ పరిజ్ఞానం పెరుగుతుందని విద్యార్థులందరూ పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని, గ్రంథాలయ పుస్తక పఠనం వలన ప్రపంచ జ్ఞానం కలుగుతుందనీ ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గేరా మోహనరావు పేర్కొన్నారు. శాఖగ్రంథాలయం, పెదనందిపాడులో ఈరోజు చదవడం అంటే మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులలో సమర్థవంతంగా చదివే అలవాటును పెంపొందించడానికి, విద్యార్థుల్లో పఠన అలవాటును పెంపొందించేందుకు పెదనందిపాడు శాఖా గ్రంథాలయం నందు ప్రతి ఆదివారం విద్యార్థుల కొరకు ప్రత్యేకంగా చదువు అంటే మాకిష్టం అనే కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని అన్నారు . గ్రంథాలయ నిర్వహకురాలు పి సుభాషిని అధ్యక్షతన ఏర్పాటు చేయబడిన సమావేశంలో మోహనరావు మాట్లాడుతూ నీతి కథలు, కథనాలు, నీతి పద్యాలు, వంటి పుస్తకాలు చదవడం వలన విద్యార్థులలో నైతిక విలువలు పెరుగుతాయని తెలిపారు. గ్రంథాలయ నిర్వహకురాలు పి సుభాషిని మాట్లాడుతూ చదువు అంటే మాకిష్టం కార్యక్రమాన్ని విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రేపు వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులకు గ్రీవెన్స్

ప్రజాశక్తి-గుంటూరు

ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఈనెల 27వ తేదీన వైద్య ఆరోగ్యశాఖలోని ఉద్యోగుల వేతన సంబంధిత సమస్యలపై ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు జిఆల్ల వైద్య ఆరోగ్యశాఖ అధికారి అధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. కావున జిల్లాలోని ఉద్యోగులు ఎవరైనా సమస్యలు ఎదుర్కొంటుంటే గ్రీవెన్స్ ద్వారా తెలియజేయాలని కోరారు.

గుజ్జనగుండ్లలో శ్రేష్ట హాస్పిటల్ ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

మాట్లాడుతున్న డాక్టర్ వై లక్ష్మణరావు

స్థానిక గుజ్జనగుండ్ల డిమార్ట్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన శ్రేష్ట హాస్పిటల్స్‌ను ఫౌండర్ అండ్ ఛైర్మన్ డాక్టర్ వై.లక్ష్మణరావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రకాల వైద్యసేవలు ఒకేచోట అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. ఇకపై వైద్యం కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా మన శ్రేష్ట హాస్పిటల్‌లో వైద్యచికిత్సలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ గొట్టిపాటి నాగార్జున మాట్లాడుతూ గుండె సంబంధిత చికిత్సలు అన్ని ఈ హాస్పిటల్‌లో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రపథమంగా జిఇ క్యాథల్యాబ్ ఆటోరైట్ మిషన్ అందుబాటులోకి ఉందని చెప్పారు ప్రముఖ రేడియాలజిస్ట్ డాక్టర్ సుస్మిత మాట్లాడుతూ ఇక్కడ 1.5 టెస్లా, యంఆర్ఐ, హెచ్ఆర్‌సిటి మొదలైన అన్ని రేడియాలజి స్కానింగ్ మిషన్లు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. అంతేకాకుంగా అన్ని రకాల రక్త పరీక్షలు అందుబాటులో ఉన్నాయన్నారు. న్యూరాలజీ, జనరల్ మెడిసిన్, పల్మనాలజి, ఆర్థోపెడిక్, కార్డియోథొరాసిక్ సర్జరీ, యూరాలజి, ఇఎన్‌టి, జనరల్ సర్జరీ, క్రిటికల్ కేర్ డిపార్ట్‌మెంట్స్ ఉన్నాయని డాక్టర్ లక్ష్మణస్వామి తెలిపారు.

శ్రమలేని జీవన విధానంతో షుగర్ వ్యాధి

ప్రజాశక్తి-గుంటూరు

మాట్లాడుతున్న డాక్టర్ భరణి

ఫాస్ట్‌ఫుడ్, శ్రమలేని జీవన విధానమే షుగర్ వ్యాధికి దారి తీస్తుందని ఎండోక్రనాలజిస్ట్ డాక్టర్ బి.భరణి అన్నారు. ఆదివారం అరండల్‌పేటలోని అవగాహన కార్యాలయంలో నిర్వహించిన ఆరోగ్య సభలో భరణి పాల్గొని మాట్లాడారు. సభకు టి.వి.సాయిరామ్ కోఆర్డినేటర్‌గా వ్యవహరించారు. డాక్టర్ భరణి మాట్లాడుతూ కండరాలలో కదలికలు లేకుండా ఎక్కువ కాలం ఉండడంవల్ల, నొప్పులు ఎక్కువగా వస్తున్నాయని తెలియజేశారు. మధు మేహం చికిత్స ఆ మనిషి యొక్క శరీర తత్వాన్ని బట్టి ఇవ్వాల్సి ఉంటండుదన్నారు. ఒకరు వాడుతున్న మందుల వల్ల వారికి షుగర్ కంట్రోల్‌లో ఉంటుంది కాబట్టి, మరొకరు అదే మందులు వాడాలని భావించకూడదు అని, ప్రతి షుగర్ పేషెంట్, వారి షుగర్ లెవల్స్ కంట్రోల్‌లో ఉంటే ప్రతి 6 నెలలకు ఒకసారి వైద్యులను సంప్రదించాలన్నారు. షుగర్ లెవెల్ కంట్రోల్లో లేకపోతే నెలకు ఒకసారి సంప్రదించాలన్నారు. షుగర్‌కు చికిత్స మనిషి బరువు, వారికి ఉన్న ఇతర అనారోగ్య సమస్యలు, కుటుంబ చరిత్ర, కొలెస్ట్రాల్ లెవెల్స్ ఇలా అనేక విషయాలను పరిగణనలోకి తీసుకొని మందులు నిర్ధారిస్తారన్నారు. మధుమేహం అదుపులో ఉంచుకోకపోతే గుండె, కళ్ళు, మూత్రపిండాలు, నరాల సంబంధించిన సమస్యలు వస్తాయని తెలిపారు. ప్యాక్డ్ ఫుడ్ వినియోగం తగ్గించి, చిరుధాన్యాలు ఆహారంలో తీసుకోవడం, కూరలు ఎక్కువగా తీసుకోవడం, పండ్లు తినడం, మొలకెత్తిన విత్తనాలు తినడం, డ్రైఫ్రూట్స్ తీసుకోవడం లాంటివి అనుసరిస్తే, అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండవచ్చని సూచించారు.ఈ సందర్భంగా అవగాహన సభ్యులు డాక్టర్ భరణిని సన్మానించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు వి.వి.రావు, శంకరరావు ఆర్.రత్నం తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రజిని

వైద్య, ఆరోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులు : మంత్రి రజిని

ప్రజాశక్తి-గుంటూరు :ముఖ్యమంత్రి వైద్య, ఆరోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని, రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దారని మంత్రి విడదల రజిని అన్నారు. స్థానిక చంద్రమౌళి నగర్‌లోని వైసిపి కార్యాలయంలో ఆదివారం డాక్టర్ సెల్ ఆత్మీయ సమావేశంలో రజని పాల్గొన్నారు. డాక్టర్స్ సెల్ అధ్యక్షులు డాక్టర్ వై.షేక్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వైద్య రంగానికి పెద్ద పీట వేశారని, ప్రజల ఆరోగ్యం గురించి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని అన్నారు. ఆరోగ్య సురక్ష ద్వారా ఇంటింటికి సర్వే చేసి ప్రతి ఇంట్లో ఉన్న ఆరోగ్య సమస్యలను తెలుసుకుని పరీక్షలను నిర్వహించి చికిత్స చేసి ఉచితంగా మందులను పంపిణీ చేసేలా చేశారని పేర్కొన్నారు. నాడు-నేడు కార్యక్రమం ద్వారా హెల్త్ సెంటర్ల రూపు రేఖలు మార్చారని, వైద్యులు, సిబ్బందిని నియమించారన్నారు. ప్రభుత్వ పథకాలన్నీ విజయవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లటానికి విశేష కృషి చేసిన విడదల రజినీని ప్రజలు గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్స్ సెల్ ఉపాధ్యక్షులు డాక్టర్ బాలకష్ణ, డాక్టర్ కోటేశ్వరరావు, డాక్టర్ షాషావలి, డాక్టర్ యాస్మిన్ పాల్గొన్నారు.

256 మాంసం విక్రయ దుకాణాలకు నోటీసులు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో ఆరోగ్యకర వాతావరణంలోనే మాంసవిక్రయాలు చేపట్టాలని స్టాల్స్‌కి నోటీసులు జారీ చేయాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. కమిషనర్ ఆదేశాల మేరకు నగరంలోని డివిజన్ల వారిగా ఎంహెచ్ఓ(ఎఫ్.ఏ.సి) మధుసూదన్ ఆధ్వర్యంలో ప్రజారోగ్య అధికారులు షుమారు 256 మాంస విక్రయ స్టాల్స్‌కి నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో చికెన్, మటన్ తదితర మాంస విక్రయ దుకాణాలు తప్పనిసరిగా స్టాల్‌లోను, పరిసర ప్రాంతాల్లో ఆరోగ్యకర వాతావరణం ఉండేలా భాధ్యత తీసుకోవాలన్నారు. మాంసం విక్రయ ప్రాంతాల్లో అపరిశుభ్ర వాతావరణం ఉంటే ప్రజలు అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందని తెలిపారు. నిషేధిత క్యారీబ్యాగ్‌లను వినియోగం చవద్దని, వ్యర్ధాల సేకరణ చేసే ఏజెన్సీకి మాత్రమే వ్యర్ధాలు ఇవ్వాలన్నారు. మాంస వ్యర్ధాలను కాల్వల్లో, రోడ్లపై వేస్తే వెంటనే ట్రేడ్ లైసెన్స్ రద్దు చేయడం, భారీ మొత్తంలో అపరాధ రుసుం విధించడం జరుగుతుందని స్పష్టం చేశారు. నగరంలో మాంసం విక్రయించే స్టాల్స్ నగరపాలక సంస్థ నుండి తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని, ఎప్పటికప్పుడు లైసెన్స్ రెన్యువల్ చేసుకోవాలని తెలిపారు. ప్రజలు కూడా మాంసం కొనుగోలు చేసే స్టాల్స్ శుభ్రంగా లేకుంటే కొనుగోలు చేయవద్దని కోరారు. నోటీసులకు స్పందించని స్టాల్స్ పై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అటవీ సంపద, వన్య ప్రాణుల సంరక్షణ ప్రథమ కర్తవ్యం

ప్రజాశక్తితో పల్నాడు జిల్లా అటవీశాఖ అధికారి ఎస్.రామచంద్రయ్య

అటవీ ప్రాంతంలో మైనింగ్ మరియు అటవీ సంపదను కాపాడడం, వన్యప్రాణుల సంరక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తూ అటవీశాఖ శాఖ సిబ్బంది సమర్ధవంతంగా పని చేస్తున్నామని పల్నాడు జిల్లా అటవీశాఖ అధికారి ఎన్. రామ చంద్రయ్య తెలిపారు. అటవీ సంపదను ఎవరైనా దోచుకోవా లని చూస్తే జరిమానాలతో సరి పెట్టకుండా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. రిజర్వ్ ఫారెస్టు సమీప గ్రామాలలో పులుల సంచారం నేపథ్యంలో ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని, రక్షణ ఏర్పాటు తీసుకుంటున్నామని, అయినప్పటికీ అప్రమత్తంగా ఉండాలని రామచంద్రయ్య తెలిపారు. ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు.

పల్నాడు జిల్లాలో అటవీ విస్తీర్ణం ఎంత ఉంది ?

పల్నాడు జిల్లాలో దాదాపు 3లక్షల ఎకరాల విస్తీర్ణంలో అటవీ ప్రాంతం ఉండగా, మాచర్ల, విజయపురిసౌత్, ప్రకాశం జిల్లా మార్కాపురం సరిహద్దు ప్రాంతాల వరకు 65వేల ఎకరాలు టైగర్ రిజర్వ్ ఫారెస్టు విస్తీర్ణం ఉంది.

పల్నాడు పరిధిలో శాఖ ద్వారా ఏ విధంగా ఆదాయం సమకూరుతుంది?

పల్నాడు జిల్లా అటవీశాఖ పరిధిలో యుకలిప్టస్ అధిక సంఖ్యలో ఉన్నాయి. బీడీ ఆకులు, వెదురు కర్రలు విక్రయానికి గత ఏడాది టెండర్ పిలవడం జరిగింది. కొన్ని కారణాల దష్ట్యా ఆ ప్రక్రియ నిలిచింది. మళ్ళీ కొత్తగా టెండర్లకు పిలవాల్సి ఉంది. అనుమతి పొందిన అటవీ పరిధిలో మైనింగ్‌కు టన్నుకు రూ 10 నామ మాత్రపు రుసుము సంబంధిత కంపెనీ చెల్లించాల్సి ఉంటుంది.

వన్యప్రాణుల సంరక్షణకు ఏ విధమైన చర్యలు తీసుకుంటున్నారు?

వన్యప్రాణుల సంరక్షణకు నీటి లభ్యత లేని ప్రాంతాలలో నీటి తొట్టెలు ఏర్పాటు చేసి ట్యాంకర్ ద్వారా మంచి నీరు అందుబాటులో ఉంచుతున్నాం. అటవీ మార్గాలలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి వన్యప్రాణులకు హాని కలిగించే ప్లాస్టిక్ కవర్లు, మద్యం సీసాలు తీసుకెళ్లనియకుండా, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

ఇటీవల పల్నాడులో కొందరు పులిని చంపారు. వారిపై ఏవిధమైన చర్యలు తీసుకున్నారు?

అడవి పందుల కోసం వేసిన ఉచ్చులో పడి పులి చనిపోయిన మాట వాస్తవమే. ఈ ఘటనలో 14 మంది నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశాము. వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే అటవీ శివారు గ్రామాలలో నివసించే ప్రజలకు వన్యప్రాణుల సంరక్షణకు సంబంధించి అటవీశాఖ అధికారులు చేపట్టిన చర్యలు చట్టాలు గురించి అవగాహన కల్పించాము.

పులుల సంచారాన్ని ఎలా గుర్తిస్తారు?

అటవీ ప్రాంతంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేశాం. దీంతో పాటు అటవీ ప్రాంతంలో నేలను చదును చేయడం వంటి కార్యకలాపాలు తరచుగా చేపడతాం. గ్రామాలకు సమీపంలో ఉన్న అటవీ భూములను చదును చేయడం ద్వారా జంతువుల పాద ముద్రలు గుర్తించి ఏయే జంతువులు సంచరిస్తున్నాయో గుర్తించి ఆ ప్రాంత ప్రజలను అప్రమత్తం చేస్తాం. అడవిలో ఏర్పాటు చేసిన కంటైనర్‌లో అటవీశాఖ అధికారులు నిత్యం అటవీ వన్య ప్రాణుల సంరక్షణకు కృషి చేస్తున్నారు.

పులులు అడవి నుండి బయటకు రావడానికి గల కారణాలు?

అటవీ సమీపంలో ఉండే గ్రామాల ప్రజలు పశువులను గొర్రెలను మేపుకునేందుకు అడవికి వెళుతున్న క్రమంలో వాటిని గమనించి ఆహారం కోసం రాత్రి సమయంలో పొరబాటున అడవి నుండి పొలాల్లోకి వస్తున్నాయి. పంటల రక్షణ కోసం రైతులు ఏర్పాటు చేసిన కరెంటు కంచెలలో చిక్కుకుని మత్యువాత పడుతున్నాయి. ఈ నేపథ్యంలో రాత్రి వేళ పొలాల్లో మోటార్లకు విద్యుత్ నిలిపివేసేలా విద్యుత్ శాఖ అధికారు లతో మాట్లాడాము. నిబంధనలు పాటించని విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకున్నాము.

నగరవనాలు ఏర్పాటుకు నిధులు, పనుల వివరాలు?

పల్నాడు జిల్లాలో 4 నగరవనాలు ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం రూ 2 కోట్లు కేటాయించారు. కోటప్పకొండ గిరి ప్రదక్షిణ మార్గం, వినుకొండ, దేవరంపాడు, మాచర్ల నగరవనాల పనులు సాగుతున్నాయి. ఇప్పటికే ఒక్కో నగరవనానికి రూ 1.40 కోట్ల చొప్పున రూ 5.60 కోట్ల నిధులు విడుదల అయ్యాయి. 70 శాతం వరకు పనులు పూర్తయ్యాయి.

సిబ్బంది కొరత ఏమైనా ఉందా?

కొరత ఉన్న నేపథ్యంలో ఔట్సోర్సింగ్ విధానంలో భర్తీ చేశాము. ప్రస్తుతం ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా అటవీశాఖలో ఉన్న 689 ఖాళీల భర్తీకి ఇటీవల రిక్రూట్మెంట్‌కు ప్రకటన విడుదల చేశారు.

వరికపూడిశెల ఎత్తిపోతల పథకానికి అటవీ అనుమతుల ప్రక్రియ ఎంతవరకు వచ్చింది?

ఫేజ్ 1 అనుమతులు లభించాయి. ఫేజ్ 2 కు సంబంధించిన రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర అటవీ శాఖ అధికారులతో చర్చించాల్సి ఉంది.

కొన్ని ప్రాంతాలలో వన్య ప్రాణుల మాంసం విక్రయాలు జరుగుతున్నాయి, మీ దృష్టికి వచ్చాయా?

సిబ్బంది పటిష్టంగా పనిచేస్తున్నప్పటికీ ఇటువంటి ఘటనలు చోటు చేసుకోవటం బాధాకరం. అటవీ సమీపంలో ఉండే తండావాసులు వన్యప్రాణుల వేట విషయంలో కలిసికట్టుగా ఉంటూ అధికారులకు సహకరించకుండా ఇటువంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. వీటిని అరికట్టడానికి సామాజిక బాధ్యతగా వ్యవహరించి ప్రజలు అటవీశాఖ అధికారులు సమాచారం ఇవ్వడం ద్వారా వన్యప్రాణుల సంరక్షణ సాధ్యమవుతుంది.

(ప్రజాశక్తి- పల్నాడు జిల్లా)